
మొక్కలు లేని ఉద్యానవనం

- కోటప్పకొండ ఉద్యానవనం అధ్వానం
- మొక్కలు ఎండిపోగా నిర్మాణాలు శిథిలం
- పాడుపడుతున్నా పట్టించుకోని పర్యాటకశాఖ

ఆహ్లాదం వెలవెల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పూలమొక్కలు.. పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉన్న ఉద్యానవనాన్ని పర్యాటక శాఖ పాడుబెట్టింది. కోటప్పకొండ దిగువన నాడు పచ్చదనంతో కళకళలాడగా నేడు ఆ పచ్చదనం ఆవిరై వెలవెలబోతోంది. పార్కు నిర్వహణలో చిత్తశుద్ధి కొరవడటంతో మొక్కలు ఎండిపోగా నిర్మాణాలు శిథిలమౌతున్నాయి. పర్యాటకులకు ఆహ్లాదం కలిగించాల్సిన పార్కు అధ్వానస్థితికి చేరింది. కొండకు దిగువన చెరువు పక్కనే టీడీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటక శాఖ ఉద్యానవనాన్ని రూ.2 కోట్లతో అన్ని హంగులతో నిర్మించింది. 2019 జనవరిలో దీనిని ప్రారంభించారు. ఆ తర్వాత పార్కుపై చిత్తశుద్ధి కొరవడటంతో ఆహ్లాదం కాస్తా అధ్వానంగా మారింది. చుక్క నీరు పోసే పరిస్థితి లేకపోవడంతో పార్కులో మొక్కలు కనుమరుగయ్యాయి. నాడు పూల మొక్కలతో కళకళ లాడిన పార్కు నేడు కళ తప్పింది.


జలవిహారం లేని చెరువు

ఇక్కడ ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టు మూతపడింది. కొండకు వచ్చే భక్తులు సందర్శించేందుకు ఏర్పాటు చేసిన పార్కు రూపురేఖలు మారిపోవడంతో పర్యాటక శాఖపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువు కట్టపై నడకకు ఏర్పాటు చేసిన ట్రాక్ కూడా అధ్వానస్థితికి చేరుకుంది.


రోప్‌వే కోసం ఏర్పాటు చేసిన ఫిల్లర్లు


అధ్వాన్న స్థితిలో దాతల విరాళంతో నిర్మించిన వేదిక

2022లో కలెక్టర్ పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించడంతో పాటు ఇక్కడి చెరువులో జలవిహారాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతల వద్ద విరాళాలు సేకరించారు. ఓ దాత వేదిక నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఈ నిర్మాణం కూడా శిథిలవుతోంది. ప్రస్తుతం చెరువులో బోట్ షికార్‌ను పూర్తిగా నిలిపివేశారు.

అటకెక్కిన రోప్ వే నిర్మాణం

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ దిగువ నుంచి త్రికోటేశ్వరస్వామి సన్నిధికి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన రోప్‌వే నిర్మాణం నిలిచి పోయింది. రాష్ట్రంలోనే ముఖ్యమైన పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకున్న కోటప్పకొండకి అదనపు హంగుగా రోప్‌వే ఉంటుందని అందరూ భావించారు. కొండ దిగువన ఉద్యానవనం నుంచి ఎగువన ఉన్న అతిథి గృహం పక్కన వరకు రోప్‌వే నిర్మించాలని నిర్ణయించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ.6.82 కోట్లు మంజూరు చేసి రోప్‌వే నిర్మాణ పనులను ప్రారంభించారు. ఉద్యానవనం స్థలంలో పిల్లర్లు కూడా నిర్మించారు. పనులు ప్రారంభిస్తామని రూ.7 కోట్లు మంజూరు చేశామని పర్యాటక శాఖ ప్రకటించింది. అయితే ప్రస్తుతం ఆ రోప్‌వే నిర్మాణం ఊసే పర్యాటక శాఖ ఎత్తడంలేదు.


ఈవో నేనే : శ్రీనివాసరెడ్డి

కోటప్పకొండ ఈవో తానేనని జీ శ్రీనివాసరెడ్డి ఆదివారం స్పష్టం చేశారు. దేవస్థానాన్ని ఈవో స్థాయి నుంచి ఏసీ స్థాయికి అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఏసీని కూడా ప్రభుత్వం నియమించింది. నల్లకాలువ శ్రీనివాసరెడ్డిని ఏసీగా నియమించింది. ఈ మేరకు ఆయన శనివారం కార్యాలయంలో తన జాయినింగ్ రిపోర్టు ఇవ్వగా అడ్డుకున్నారు. ఏసీకి బాధ్యతలు అప్పగించాల్సిన జీ శ్రీనివాసరెడ్డి అధికార పార్టీ నేతల అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను గౌరవించడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన ఇక్కడ ఇన్‌చార్జి మాత్రమే అయినా ఈవో బాధ్యతలు వదులుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈవో, ఏసీల మధ్య నెలకొన్న వివాదం దేవదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు ఉన్నతాధికారులు తలొగ్గుతారో ఏసీకి బాధ్యతలు చేపట్టేలా చర్యలు తీసుకుంటారో చూడాలి. అడిగొప్పల దేవస్థానాన్ని కూడా ఈవో స్థాయి నుంచి ఏసీ స్థాయికి అప్‌గ్రేడ్ చేసి ప్రభుత్వం ఏసీని నియమించింది. ఏసీకి బాధ్యతలు అప్పగించి అక్కడి ఈవో రిలీవ్ అయ్యారు. అయితే ఇక్కడ కూడా ఏసీ చేరడానికి వీలు లేదని అధికార పార్టీ నేతలు ఒత్తిడి తెచ్చినప్పటికీ ఈవో నిబంధనలను అనుసరించి నడుచుకోవడం గమనార్హం.

ఎన్నికల.. బదిలీలలు

ఎన్నికల సమీపిస్తోన్న తరుణంలో ఉద్యోగుల బదిలీలకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల్లో రాజకీయ జోక్యం నివారించడమే బదిలీల ప్రధాన ఉద్దేశం. అయితే ఇప్పటి వరకు జరిగిన బదిలీల తీరుతెన్నులను పరిశీలిస్తే ఏ రాయి అయితే ఏమిటి పళ్లు ఊడగొట్టుకోవడానికి అన్న చందాన ప్రక్రియ తయారైందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నేతల సిఫార్సులతో జరిగిన పోస్టింగ్‌లపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బదిలీల ఉద్దేశమే అధికారపార్టీ ప్రాపకాన్ని తగ్గించడమైతే ఏకంగా వారి సిఫార్సు లెటర్లతోనే పోస్టింగ్‌లు దక్కించుకున్న వారు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉన్నారంటే వారి బరితెగింపు ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేసే విధంగా కూడా కొన్ని చోట్ల నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలను ఉద్యోగ సంఘాలు కూడా వ్యక్తం చేస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మొత్తం ప్రక్రియ పాలకపార్టీ కనుసన్నల్లో జరగడంతో బదిలీల లీలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

- వైసీపీ నేతల మాటే చెల్లుబాటు
- అధికార పార్టీ సిఫార్సు లెటర్లతో పోస్టింగ్‌లు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈసీ ఆదేశాలు బేఖాతరు
- అధికార పార్టీ అనుకూల పోస్టింగ్‌లపై మండిపడుతోన్న టీడీపీ



బాపట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశా లతో అధికారులు ఎన్నికల విధుల్లో భాగస్వామ్యమయ్యే ఉద్యోగుల బదిలీలను చేపట్టారు. ఒకే చోట మూడేళ్లు పూర్తి చేసుకున్న వారితో పాటు స్థానికత కొలమానంగా బదిలీలను చేపట్టాలని ఎన్నికల కమిషన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులో భాగంగా ఈ నెల మొదటి వారంలో రెవెన్యూ, పోలీస్ విభాగాల నుంచి వందల సంఖ్యలో ఉద్యోగులను బదిలీ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. అయితే ఈ చేర్పులు మార్పులు మొత్తం పాలకపార్టీ నేతల కనుసన్నల్లోనే జరిగాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పొరుగు జిల్లాలో తమకు అనుకూలంగా ఉండే అధికారులను వెతికి మరీ వైసీపీ నేతలు తమకు అనుకూలంగా ఉండే చోట పోస్టింగ్ వేయించుకున్నారు. విస్తృత పరిచయాలున్న కొంతమంది ఉద్యోగులు అయితే ఏకంగా వారే నేతలను సంప్రదించి మీ మాటే శిరసావహిస్తామనే వాగ్దానంతో అనుకున్న చోట బదిలీని బహుమానంగా పొందగలిగారన్న విమర్శలున్నాయి. ఈ తంతు ఎన్నికల ప్రక్రియలో కీలకంగా వ్యవహరించే రెవెన్యూ, పోలీస్ విభాగాల్లో చోటుచేసుకుంది. ఈ రెండు విభాగాల నుంచి ఒక్క బాపట్ల జిల్లాలోనే 50 మందికి పైగా బదిలీలు అధికారపార్టీ నేతల ఆశీస్సులతోనే జరిగాయని తెలుస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈ సంఖ్య వందల్లో ఉన్నట్లు సమాచారం. రెవెన్యూలో తహసీల్దార్ల బదిలీలు ఎక్కువగా ఉండగా, పోలీసు విభాగంలో దాదాపు ప్రతి చోట ఎస్ఐ, సీఐలను బదిలీ చేశారు.

స్థానిక నేతల అంగీకారంతోనే..

ఉమ్మడి జిల్లాలు కొలమానంగా ఒకే చోట మూడేళ్ల పూర్తి చేసుకున్న ఉద్యోగులను బదిలీ చేసే క్రమంలో అనేక వింతలు చోటు చేసుకున్నాయి. వేరే జిల్లాల నుంచి ఇక్కడకు రావాలనుకున్న వారు అందుకు ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేసుకున్నట్లు సమాచారం. అధికార పార్టీ నేతల ఆశీస్సులతో అనుకున్న చోటకు బదిలీ చేయించుకోగలిగారు. ఇటీవల జరిగిన బదిలీలలో దాదాపు 75 శాతం ఈ విధంగా జరిగినవే కావడం గమనార్హం. ఇక పోలీసు శాఖలో అయితే స్థానికంగా ఉన్న నేతల లెటరు ఆధారంగానే ఈ తంతు నడిచిందనే ఆరోపణలు ఆ శాఖ నుంచే రావడం గమనార్హం. అద్దంకిలో వైసీపీ సమన్వయకర్తగా నియమితులైన నేత కనుసన్నల్లోనే ఉద్యోగుల బదిలీల పర్వం నడిచినట్లు తెలుస్తోంది. సీఐలు, ఎస్ఐల పోస్టింగ్‌ల విషయంలో ఆ నేత అంగీకారమే ప్రామాణికంగా బదిలీలు చేపట్టినట్లు సమాచారం. బాపట్ల రూరల్ పోస్టింగ్ విషయంలో సదరు నేత ఆదేశాలతోనే పోస్టింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. రెవెన్యూలో అయితే నేతలు తమ అనుకూలురును ఆయా మండలాల్లో తహసీల్దార్లుగా నియమించుకోవడంలో విజయం సాధించారు. నిత్యం ఫ్యాక్షన్ గొడవలతో అట్టుడుకుతున్న పల్నాడు జిల్లాలో స్థానిక నేతల అండదండలతోనే 80 శాతం బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేతల అండదండలతో వారికి అనుకూలంగా జరిగిన ఈ బదిలీలపై ప్రతిపక్ష టీడీపీ నాయకులు మండిపడుతున్నారు.

ఇక పారదర్శకతకు ఆస్కారం ఎక్కడ...

ఎన్నికలు సమీపిస్తున్న వేళ అత్యంత పారదర్శకంగా జరగాల్సిన బదిలీలు పాలకపార్టీ నేతల అంగీకారంతోనే జరగడంపై విపక్ష టీడీపీ మండిపడుతోంది. బదిలీలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చి వదిలేసిందని, కానీ వాటిని నిష్పక్షపాతంగా అమలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అస్మదీయులకు పదవుల పందేరం చేసి ఎన్నికల వేళ అక్రమాలకు రంగం సిద్ధం చేసుకుందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. బదిలీలు అన్నీ నిబంధనల ప్రకారమే జరిగినట్లు పైకి కనబడుతున్నా అనుకున్న చోట పోస్టింగ్ పొందిన వారంతా పాలకపార్టీ ప్రాపకం ఉన్నవారేనని ఈసీ ఈ అవకతవకలపై దృష్టి సారించాలని టీడీపీ అభ్యర్థిస్తోంది.

ఓట్లకు.. ఇంధనం



- ఎన్నికలు సమీపిస్తున్న వేళ కరెన్సీ కట్టలు సిద్ధం
- కోట్లు వెచ్చించాల్సిన ఆశావహులు
- నోటిఫికేషన్‌కు ముందే డబ్బు తరలింపు ?

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో గెలుపునకు ధనమే కీలకం. పార్టీలు టిక్కెట్ కేటాయింపులో కూడా డబ్బును ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. టిక్కెట్ ఇస్తే ఎంత ఖర్చు పెట్టగలరు... ఎలా సమకూర్చుకుంటారు అనే ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పగలిగిన నేతలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. రాజకీయాల్లో సీనియర్లు, జూనియర్లు తేడా లేదు. డబ్బు భారీగా ఖర్చు చేయగల సత్తా ఉన్న నేతలకే పార్టీలు టిక్కెట్లు ఇస్తున్నాయన్న ప్రచారం ఉంది. ధనం తర్వాతే కులానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒకటి రెండు టిక్కెట్‌లను మాత్రమే సమర్థత ఆధారంగా ఇస్తు న్నారు. ఒక్కో అభ్యర్థికి రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్లు ఖర్చు అవుతుందన్న అంచనా వేస్తున్నారు.

ఈ మేరకు లెక్క కడితే పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రూ.1,700 నుంచి రూ.2,100 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాగా ఉంది. ఎన్నికల్లో నిబంధనల మేర చూపించే ఖర్చు మినహా మిగతాది నల్లధనమే ఖర్చు చేస్తారు.

కోట్లు కుమ్మరిస్తేనే గెలుపు...

కోట్లు కుమ్మరిస్తేనే గెలుపు అవకాశాలు ఉండే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు అధికారికంగా టిక్కెట్‌లు పూర్తిస్థాయిలో ప్రకటించనప్పటికీ అభ్యర్థులకు సమాచారం ఇచ్చారు. దీంతో డబ్బు సమకూర్చుకోవడంతో వారంతా నిమగ్నమయ్యారు. నోటిఫికేషన్ వెలువడే లోపు డబ్బు సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఒక్కో ఓటుకు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. కొన్ని చోట్ల రూ.2,000 కూడా ఇచ్చారు.

డబ్బు సమకూర్చుకోవడంలో నిమగ్నం..

నామినేషన్ దాఖలు నుంచి పోలింగ్ వరకు ఊహించని రీతిలో డబ్బు ఖర్చు అవుతుంది. ప్రచారానికే ఎక్కువగానే ఖర్చుచేయాల్సి ఉంది. మద్యం కూడా ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తోంది. మద్యం ఖర్చు కూడా భారీగానే ఉంటుంది. ఒక్కో నియోజకవర్గంలో కేవలం మద్యానికి ఖర్చు రూ.5 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. పోలింగ్ ఏజెంట్లు, నేతల కొనుగోలు జరుగుతుంటాయి. వీరికి లక్షల్లో చెల్లిస్తుంటారు. విందులు, వినోదాలకు కూడా భారీగానే ఖర్చు చేస్తుంటారు. ఓటు కొనుగోలు అన్నిటికన్నా ప్రధానమైనది. ఈ సారి ఎన్నికల్లో ఓటు రేటు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు ఉంటుందని నేతలు అంచనా వేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో లక్ష నుంచి 1.50 లక్షల ఓట్లు కొనుగోలు చేస్తుంటారు. దీని ప్రకారం ఓట్ల కొనుగోలుకు 25 నుంచి 30 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నెల మూడవ వారంలో నోటిఫికేషన్ వస్తుందని ప్రచారం నేపథ్యంలో అప్పటికల్లా డబ్బు సమకూర్చుకోవడం పూర్తి చేసుకోవాలని వారు భావిస్తున్నారు. నోటిఫికేషన్ వెలువడితే తనిఖీలు ముమ్మరంగా ఉంటాయి. దీంతో ఆ సమయంతో డబ్బు ఒక చోట నుంచి మరో చోటికి చేరవేసే పరిస్థితులు ఉండవు. దీంతో నోటిఫికేషన్ వెలువడే లోపలే డబ్బు పక్రియ పూర్తి చేసుకునే దిశగా అభ్యర్థులు జాగ్రత్త పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈసారి ఎన్నికల ఖర్చు ఉంటుందని అంచనా. నల్లధనమే ఎన్నికల్లో ఖర్చు చేస్తారన్నది బహిరంగ రహస్యమే.

మురుగుపై మొద్దునిద్ర


పనిచేయని పైప్‌లైన్ క్లీనింగ్ యంత్రం

- మున్సిపాల్టీలో రూ.లక్ష లేదంట
- డ్రెయినేజీ శుభ్రత యంత్రం మరమ్మతులపై నిర్లక్ష్యం
- రహదారులపై మురుగు.. కంపుకొడుతున్న అరండల్‌పేట


నరసరావుపేట, ఫిబవరి 11: మురుగుపై మొద్దునిద్ర.. అధికారుల నిర్లక్ష్యం.. రూ.లక్ష వ్యయంపై మీనమేషాలు.. కాంట్రాక్టర్ల వెనుకంజతో.. జిల్లా కేంద్రమైన నరసరావుపేట మురుగు కంపుకొడుతుంది. భూగర్భ డ్రెయినేజీ పైప్‌లైన్లను శుభ్రం చేసే యంత్రం నెలరోజులకు పైగా మూలనపడింది. మురుగుతో ప్రజలు అల్లాడుతున్నా.. రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తున్నా మున్సిపాల్టీ మొద్దునిద్ర వీడటంలేదు. యంత్రానికి మరమ్మతులు చేసి మురుగు సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. యంత్రం మరమ్మతులకు రూ.లక్ష వ్యయం అంచనా వేశారు. అయితే ఆ లక్ష మంజూరు కాకపోవడంతో ఆ యంత్రాన్ని మూలన పడేశారు. యంత్రానికి మరమ్మతులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందు కురావడంలేదు. ఇంజనీరింగ్ విభాగం నుంచి సకాలంలో బిల్లులు చెల్లించక పోవడమే ఇందుకు కారణమని కార్యాల య వర్గాలు తెలి పాయి. నెల రోజులకు పైగా భూగర్భ డ్రెయినేజీ పైపుల నుంచి మురుగు నీరు అరండల్‌పేటలో ప్రధాన రహదారులపై ప్రవహిస్తుంది. ఈ ప్రాంతమంతా తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోంది. పల్నాడు రోడ్డులో టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు అధ్వర్యంలోని అన్న క్యాంటీన్ వద్ద కూడా మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో ఇక్కడ పేదలు భోజనం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాల్టీకి రూ.లక్ష నిధులు ఎప్పుడు సమకూరతాయో.. యంత్రానికి ఎప్పుడు మరమ్మతులు చేస్తారో.. మురుగు సమస్య ఎప్పుడు వీడు తుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.


పల్నాడు రోడ్డులోని ఎన్‌టీఆర్ క్యాంటిన్ ఎదుట భూగర్భ డ్రైనేజ్ మ్యాన్ హోల్ నుంచి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

- లక్షలు కొల్లగొడుతున్న లాటరీ
- సామాన్యుడి జేబుకు చిల్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిలువు దోపిడీ
- వైసీపీ నేతల అండతో చెలరేగుతున్న నిర్వాహకులు

తగిలేదేలే!


నిర్వాహకులు రాసే నెంబర్‌లు



గుంటూరు, ఫిబ్రవరి 11 : అదృష్టం వరిస్తే కనక వర్షం కురిసినట్లేనని నిర్వాహకులు ఆశచూపి ఎర వేస్తున్నారు. కేరళ రాష్ట్రంలో అధికారికంగా కొనసాగుతున్న లాటరీలో ఎంతోమందికి లాటరీ తగిలి కోట్లు వచ్చిన విషయాన్ని ఇక్కడ ప్రచారం చేస్తూ మీరు కూడా అదేవిధంగా కోట్లు సంపాదించుకోవచ్చు అని ఆకర్షిస్తున్నారు. ఈ లాటరీ మాయాజాలంలో నిర్వాహకులు లక్షల్లో కొల్లగొడుతుంటే టికెట్లు కొనుగోలు చేసిన సామాన్యులు దివాళా తీస్తున్నారు. కనీసం ఒక్కసారైనా లాటరీ తగలకపోతుందా.. పోగొట్టుకున్న డబ్బు రాబట్టుకోలేమా అనే ఆశతో అప్పులు చేసి మరీ టికెట్లు కొనుగోలు చేసి సర్వం కోల్పోతున్నారు. ఆన్‌లైన్‌లో సాగే ఈ లాటరీకి ఎటువంటి అనుమతులు లేవు. దీని నిర్వాహకులు ఎవరు? ఈ వెబ్‌సైటును ఎక్కడి నుంచి ఆపరేట్ చేస్తున్నారు? ఫలితాలను ఎవరు విడుదల చేస్తున్నారు. ఈ డబ్బులు అన్నీ ఎక్కడికి చేరుతున్నాయి? అనే ప్రశ్నలకు సమాధానం లేదు.

వంద రూపాయలు కట్టి లాటరీ టికెట్ కొనండి.. మీదే అదృష్టం.. లాటరీ తగిలితే రాత్రికి రాత్రే లక్షాధికారులు కావచ్చు.. అంటూ వల వేస్తున్నారు. దీంతో ఓసారి తమ అదృష్టం పరీక్షించుకుందామని పేద, మధ్య తరగతివారు చమటోడ్చి సంపాదించుకున్న డబ్బుతో టికెట్లు కొంటున్నారు. కనీసం ఒక్కసారైనా లాటరీ తగలకపోతుందా.. పోగొట్టుకున్న డబ్బు రాబట్టుకోలేమా అనే ఆశతో అప్పులు చేసి మరీ టికెట్లు కొనుగోలు చేసి సర్వం కోల్పోతున్నారు.

ఆట సాగేదిలా...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు కేంద్రాల్లో రోజూ సాయంత్రం నాలుగు గంటలకు ఆన్‌లైన్‌లో లాటరీ ఫలితాలను విడుదల చేస్తారు. అప్పటి నుంచి ఆ తర్వాత రోజు లాటరీ కోసం టికెట్ల విక్రయం ప్రారంభిస్తారు. తర్వాత రోజు మధ్యాహ్నం 2:30 గంటల వరకు టికెట్ల విక్రయం జరుగుతుంది. ఆ తర్వాత ఏఏ నెంబర్ల నుంచి ఏ నెంబర్ల వరకు టికెట్లు విక్రయాలు జరిగాయనే సమాచారం ఆన్‌లైన్‌లో నిర్వాహకుడి దృష్టికి వెళ్తుంది. టికెట్ ధర రూ.40 నుంచి రూ.1500 వరకు ఉంటుంది. ఒక్కో లాటరీపై ఐదు అంకెల నెంబర్ ఉంటుంది. అది తగిలితేనే లాటరీ వచ్చినట్లు. రూ.40తో టిక్కెట్ కొనుగోలు చేస్తే ఐదు అంకెలు లాటరీ తగిలితే రూ.80 వేలు ఇస్తారు.

పక్కాగా మోసం చేసేదిలా..

ఈ లాటరీ వ్యవహారంలో పక్కాగా మోసానికి పాల్పడుతున్నారు. అదెలా అంటే.. ఈరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి టికెట్ల విక్రయం ప్రారంభమవుతుంది. తర్వాత రోజు నాలుగు గంటలకు ఆన్‌లైన్‌లో ఫలితాలు వెల్లడిస్తారు. ఫలితాల వెల్లడికి గంటన్నర ముందుగా టికెట్ల విక్రయం పూర్తవుతుంది. అయితే నిర్వాహకులు ముందుగా అన్ని టికెట్లు విడుదల చేయకుండా కొన్ని టికెట్లు వారి వద్ద ఉంచుకుంటారు. ఆ టికెట్ల నంబర్లనే ఆన్‌లైన్‌లో ఉంచుతారు. అంటే ఎవరు ఎన్ని టికెట్లు కొనుగోలు చేసినా లాటరీ మాత్రం రాదని స్పష్టంగా అర్థం అవుతుంది. అంతేగాక లాటరీ ఫలితాలు విడుదల చేయడానికి గంటన్నర ముందే టికెట్ల విక్రయం పూర్తవుతుంది కాబట్టి టికెట్లు విక్రయించిన వారందరూ ఏ ఏరియాలో ఎన్ని నెంబర్ల టికెట్‌లు విక్రయించిందీ ఆన్‌లైన్‌లో ఉంచుతారు. దీనిని బట్టి విక్రయించని టికెట్ నెంబర్లను కూడా ఆన్‌లైన్‌లో ఉంచుతున్నారు. దీంతో కొందరు రిటైల్ టికెట్ విక్రేతలు ఇదే విషయాన్ని కొనుగోలుదారులకు చూపి మరికొన్ని టికెట్లు కొంటే లాటరీ తగిలేదే అంటూ మరింత ఆశ కల్పిస్తున్నారు.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఐరాసలో సంస్కరణలు అవరోధాలు-పరిష్కారాలు



త్రాసు ముల్లు ఎప్పుడూ సమతౌల్యతను సూచిస్తూ మధ్యస్థంగా ఉండి తీరాలి. అప్పుడే ఆ త్రాసు బేరీజు వేసేందుకు అనుకూలమైనదిగా పరిగణనలో ఉంటుంది. అలా కాకుండా ఎటువైపు ఒరిగినా తూనిక చేసే అర్హత కోల్పోతుంది. నిజానికి ఎంచి చూడాల్సిన ఏ క్రతువుకైనా ఉండాల్సిన ప్రాథమిక లక్షణం ఇది. స్థిరత్వం, శాంతి, సహకారం, ప్రాథమిక సూత్రాలుగా ప్రపంచానికి పెద్ద దిక్కుగా ఏర్పడిన ఐక్యరాజ్య సమితి, కొన్ని దేశాలవైపు మొగ్గిన నేపథ్యంలో దాని విశ్వసనీయతపై సర్వత్రా నిరసనలు వినిపిస్తున్నాయి. అదే సంస్కరణల అవసరాన్ని తెరపైకి వచ్చింది. ముఖ్యంగా ఐక్యరాజ్య సమితిలో అత్యంత ప్రధానమైనదిగా భావించే భద్రతా మండలి విస్తరణ, ప్రజాస్వామికీకరణపై ప్రపంచవ్యాప్తంగా డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన కోఫీ అన్నన్ సైతం 'భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టడమో లేదా దాని ప్రాబల్యాన్ని కోల్పోయే ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమో తేల్చుకోవాల్సిందే'అని హెచ్చరించారు. ఇటీవల భారత్ వేదికగా జరిగిన జీ-20 సమావేశాల్లో ఏకగ్రీవంగా ఆమోదించిన ఢిల్లీ డిక్లరేషన్‌లో సైతం 'ఐక్యరాజ్య సమితిలో సంస్కరణలు' అంశాన్ని చేర్చారు. ఇటీవల ఎలాన్ మస్క్ సైతం 'అత్యధిక జనాభాగల దేశమైన భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం లేకపోవడం అసంబద్ధం' అని, ఐక్యరాజ్య సమితి అంగాలను సంస్కరించాల్సిన అవసరం ఉందని ట్వీట్ చేశారు. పరిమితికి మించిన అధికారాన్ని అనుభవిస్తున్న దేశాలు దానిని వదులుకోవడానికి సుముఖంగా లేకపోవడం వల్లే ఈ తంటా అని కూడా ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. దాంతో మరోసారి తాజాగా భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం అనే అంశం తెరపైకి వచ్చింది. దరిమిలా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి, దాని ప్రాముఖ్యం, విస్తరణ, ప్రజాస్వామ్యీకరణల అవసరం, అవరోధాలు, ప్రత్యామ్నాయాల గురించి తెలుసుకుందాం!

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి

● ఐక్యరాజ్య సమితికి చెందిన ఆరు ముఖ్య అంగాల్లో భద్రతా మండలి ఒకటి. అంతర్జాతీయ శాంతి భద్రతల పరిరక్షణ దాని బాధ్యత. ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో కొత్త సభ్య దేశాల ప్రవేశానికి సిఫార్సు చేయడం, ఐక్యరాజ్య సమితి చార్టర్‌కు చేసే మార్పులకు ఆమోదం తెలపడం దీని అధికారాలు. అంతేకాకుండా అంతర్జాతీయ శాంతిని కాపాడేందుకు ప్రపంచంలో ఎక్కడికైనా భద్రతా దళాలను పంపడం, మిలటరీ చర్యలు చేపట్టడం, పరిస్థితులను అనుసరించి దేశాలపై వివిధ ఆంక్షలు(శాంక్షన్స్) విధించడమనే కీలకాధికారాలు కూడా ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి అంగాలన్నింటిలో ఒక్క భద్రతా మండలికి మాత్రమే- సభ్య దేశాలకు నిర్బంధంగా పాటించాల్సిన ఆజ్ఞలు జారీ చేసే అధికారం ఉంది. మిగతా అయిదు అంగాలకు కేవలం సభ్య దేశాలకు సిఫార్సులు చేసే అధికారమే ఉంది. భద్రతామండలికి మాత్రమేగల నిర్ణయాలు అమలు చేసే శక్తి దానిని, దానిలోని శాశ్వత సభ్యులను అత్యంత శక్తిమంతంగా మార్చింది.

భద్రతా మండలి కూర్పు

● భద్రతా మండలిలో వీటో అధికారం ఉన్న అయిదు శాశ్వత సభ్య దేశాలు, రెండేళ్ల కాలానికి ఎన్నుకొన్న వీటో అధికారం లేని మరో పది దేశాలు కలిపి మొత్తం 15 సభ్య దేశాలు ఉంటాయి. వీటిలో అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు ఐక్యరాజ్య సమితి చార్టర్ 1946 ప్రకారం శాశ్వత సభ్య దేశాలుగా గుర్తింపు పొందాయి. తాత్కాలిక సభ్య దేశాలకు గల పది స్థానాలకుగాను ఐక్యరాజ్య సమితి సాధారణ సభ ఏటా అయిదు దేశాల చొప్పున రెండేళ్ల కాలానికి ఎన్నుకుంటుంది. రిటైర్ అవుతున్న అయిదు తాత్కాలిక సభ్య దేశాలు వెంటనే ఎన్నిక అవడానికి వీలు లేదు. ఈ పది తాత్కాలిక సభ్య దేశ స్థానాలు ప్రాంతీయ ప్రాతిపదికన పంపిణీ అవుతాయి. ఆఫ్రికా, ఆసియా దేశాలకు 5; తూర్పు యురోపియన్ దేశాలకు 1; లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలకు 2; పశ్చిమ యురోపియన్ దేశాలకు 2 స్థానాలు ఉంటాయి.

● ఈ పది తాత్కాలిక స్థానాల్లో ఎటువంటి నామినేటెడ్ స్థానాలు ఉండవు. అన్ని స్థానాలకూ రహస్య బ్యాలెట్ పద్ధతిన సాధారణ సభలో ఎన్నికలు నిర్వహిస్తారు. 2/3వ వంతు మెజారిటీని సాధించిన దేశాలకు రెండేళ్ల పాటు భద్రతా మండలి తాత్కాలిక సభ్యత్వం లభిస్తుంది. భద్రతా మండలి సభ్య దేశాల మధ్య దాని అధ్యక్ష పదవి నెలనెలా బదిలీ అవుతూ ఉంటుంది.

● శాశ్వత సభ్య దేశాలైన పీ-5 దేశాల్లో ప్రతీ ఒక్క దేశానికి వీటో అధికారం ఉంటుంది. ఈ అధికారంతో వారు భద్రతా మండలిలో ఏ తీర్మానానికి అయినా వ్యతిరేకంగా ఓటు వేసి దానిని అడ్డుకోవచ్చు. ఒక కొత్త దేశాన్ని సభ్య దేశంగా చేర్చుకోవడం లేదా ఐరాస జనరల్ సెక్రటరీగా ఎవరి ఎన్నికనైనా అడ్డుకోవడానికి సైతం చేయవచ్చు. అయిదు శాశ్వత సభ్య దేశాల్లో ఏ ఒక్కటైయినా వ్యతిరేకంగా ఓటు వేసి భద్రతా మండలి ఏ తీర్మానాన్నైనా అడ్డుకోవచ్చు. భద్రతా మండలి ఏ నిర్ణయమైనా అయిదు శాశ్వత సభ్య దేశాల సర్వామోదంతోనే జరగాలి. ఏ ఒక్కరు వ్యతిరేకించినా వీటో అధికారం ఉపయోగించినా అది చెల్లదు.

● శాశ్వత సభ్య దేశాలకు ఉన్న ఈ వీటో అధికారాన్ని వినియోగించి అసంబద్ధ నిర్ణయాలను అడ్డుకోవడానికి బదులు ఇటీవల ఆ దేశాలు తమ స్వప్రయోజనాల కోసం రాజకీయ వ్యూహాల కోసం వినియోగిస్తున్నాయి. దీనితో ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలి ఏర్పాటుకు గల మూల ఉద్దేశాలకు గండి పడుతోంది. అంతేకాక భద్రతా మండలిలోని శాశ్వత సభ్య దేశాల దురాగతాలకు వ్యతిరేకంగా భద్రతా మండలి చర్యలు తీసుకోవడానికి అవకాశం లేకుండా పోతోంది.

● అమెరికా ఒకప్పుడు ఇరాక్‌పై దండెత్తినపుడు, రష్యా ప్రస్తుతం ఉక్రెయినపై దాడి చేస్తున్న సందర్భంలోనూ భద్రతా మండలి క్రియాశూన్యంగా మిగిలిపోతోంది.

అంతేకాక శాశ్వత సభ్య దేశాల వ్యూహాత్మక ప్రయోజనాల కోసం వాటి మిత్ర దేశాలను వెనకేసుకు వచ్చే దుశ్చర్యలను నిలువరించలేని దుస్థితికి భద్రతా మండలి చేరుకుంది. ఉదాహరణకు ఇజ్రాయెల్‌కు అమెరికా కొమ్ముకాయడం; చైనా, పాకిస్థాన్‌ల ఉగ్రవాదాన్ని వెనకేసుకు రావడం వంటి ఉదంతాలను చెప్పుకోవచ్చు. అంతేకాక భద్రతా దళాల ప్రయోగం, ఉపసంహరణ, ఆంక్షల విధింపు వంటి చర్యలను ప్రపంచంలోని అశాంతిని నిర్మూలించేందుకు కాక పీ-5 దేశాలు తమ స్వప్రయోజనాలు, చమురు నిల్వలు కొల్లగొట్టేందుకు ఉపయోగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వీటో అధికారంలో సంస్కరణలకు, భద్రతా మండలిలో ప్రజాస్వామ్యీకరణకు, జనాభా ప్రాతినిధ్య సమతౌల్యతకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్లు పెరుగుతున్నాయి.

జీ-4 కూటమీ

- భారత్ సహా మరో మూడు దేశాలు(జపాన్, జర్మనీ, బ్రెజిల్) కలసి జీ-4 కూటమిగా ఏర్పడి పరస్పర మద్దతుతో భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి కృషి చేస్తున్నాయి. వీరు తమతో పాటు ఆఫ్రికా వంటి ఇతర ప్రాంతాలకు కూడా ప్రాతినిత్యం దక్కాలని వాదిస్తున్నాయి.
- ఈ జీ-4 దేశాల ఆర్థిక, రాజకీయ, సైనిక బలం కొన్ని దశాబ్దాలుగా విస్తరించడం; పీ-5 దేశాలతో సరితూగగల స్థాయిని సాధించడం వంటి అంశాల నేపథ్యంలో జీ-4 దేశాలు తమ ప్రాతినిధ్యానికి మరింత పట్టుపడుతున్నాయి.
- శాశ్వత సభ్య దేశ స్థానాలను అయిదు నుంచి పదకొండుకు, తాత్కాలిక సభ్య దేశాల స్థానాలను పది నుంచి పధ్నాలుగుకు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి.

కాఫీ క్లబ్

జీ4 ప్రయత్నాలను నిర్వీర్యం చేయడానికి ఆయా దేశాలతో ఆర్థికపరమైన పోటీ, రాజకీయపర శతృత్వం గల దేశాలు 'కాఫీక్లబ్'గా ఏర్పడి జీ4 దేశాలకు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వాన్ని అడుకొనే ధ్యేయంతో పనిచేస్తున్నాయి. ఈ కాఫీ క్లబ్‌లో పాకిస్తాన్, దక్షిణకొరియా, ఇటలీ, అర్జెంటీనా సభ్యులుగా ఉన్నాయి.

(మిగతా రేపటి దిక్సూచి పేజీలో)




ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

బయాలజీ

మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థ



అన్ని జీవులలో ప్రత్యుత్పత్తి అనేది ప్రధాన ధర్మాలలో ఒకటి. ప్రత్యుత్పత్తి విధానంలో జీవులు పాత జీవుల స్థానంలో వాటిని పోలిన లేదా కొద్ది తేడాలతో ఉన్న కొత్త జీవులను ఉత్పత్తి చేస్తాయి. ఒక ప్రజాతి కొనసాగడానికి, జన్యు పదార్థాన్ని పునఃఉత్తేజనం చేయడానికి ప్రత్యుత్పత్తి విధానం అత్యవసరం. వివిధ జంతువులలో వివిధ రకాల ప్రత్యుత్పత్తి జరుగుతుంది.

ప్రత్యుత్పత్తిలో హార్మోన్లు ముఖ్య పాత్రపోషిస్తాయి. ఉదాహరణకు పురుష, స్త్రీ బీజకోశాల హార్మోన్లు.. ప్రాథమిక, ద్వితీయ లైంగిక లక్షణాలు, బీజకోశాల పరిపక్వత, లైంగిక చక్రాల లయబద్ధత, పిండం విడుదల క్షీరోత్పత్తి మొదలైన వాటిలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

జీవులు రెండు రకాలుగా ప్రత్యుత్పత్తి చేసుకుంటాయి. అవి..అలైంగిక ప్రత్యుత్పత్తి, లైంగిక ప్రత్యుత్పత్తి. అలైంగిక ప్రత్యుత్పత్తి జనక జీవిలో లేదా ఒకే జీవిలోనే జరుగుతుంది. ఈ విధానంలో ప్రత్యేకంగా పురుష, స్త్రీ బీజకోశాలు ఉండవు. విచ్ఛిత్తి, కోరకీభవనం, సిద్ధబీజాలు ఏర్పడటం, ముక్కలగుట, పునరుత్పత్తి, క్లోనింగ్, అనుషేకజననము అనే పద్ధతుల ద్వారా జరుగుతుంది. అలైంగిక విధానంలో ప్రతి జీవి ప్రౌఢజీవిగానే జన్యుపరంగా తమను పోలిన జీవులను తయారు చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. లైంగిక ప్రత్యుత్పత్తిలో స్త్రీ, పురుష జీవులు ఏకస్థితిక బీజకణాలను(అండాలు, శుక్ర కణాలు) ఉత్పత్తి చేసి, ఫలదీకరణం చెంది, ద్వయస్థితిక పిల్ల జీవిని తయారు చేస్తుంది.

పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థ

పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ప్రత్యుత్పత్తి ప్రక్రియలో పాల్గొనే అనేక అవయవాలు శ్రోణి ప్రాంతంలో ఉంటాయి. అవి..ఒక జత ముష్కాలు, ఒక జత శుక్రవాహికలు, బాహ్య జననాంగాలు, అనుబంధ గ్రంథులు.

ముష్కాలు: ఒక జత అండాకార ముష్కాలు, ఉదర కుహరం బయట ముష్క గోణిలో వేలాడుతూ ఉంటాయి. ముష్కగోణులు వెనుక వేలాడుతూ ఉన్న సంచి వంటి నిర్మాణం. ఇది ముష్కాలకు రక్షణ ఇస్తూ, శుక్ర కణోత్పత్తికి కావలసిన ఉష్ణోగ్రత(శరీర ఉష్ణోగ్రత కంటే 2 నుంచి 2.5 డిగ్రీల సెల్సియస్ తక్కువ) ఉండేటట్లు చేస్తుంది. పరిసరాల ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు ముష్కగోణిలోని క్రిమాస్టర్ కండరం సంకోచం వల్ల ముష్కగోణి వెచ్చగా ఉన్న దేహానికి దగ్గరగా అవుతుంది. డార్టోస్ కండర సంకోచం వల్ల ముష్కగోణి ముకుళించుకుంటుంది. ఉష్ణోగ్రత సాధారణంగా ఉన్నప్పుడు పై రెండు కండరాలు విరామస్థితిలో ఉంటాయి. అందువల్ల ముష్కగోణి వెచ్చటి దేహానికి దూరంగా వేలాడుతూ ఉంటుంది. కొన్ని అసాధారణ సందర్భాల్లో ముష్కాలు శుక్ర కణాలను, టెస్టోస్టిరాన్ అనే హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఈ ముష్కాలలో అధిక సంఖ్యలో మిలియన్ల కొద్దీ శుక్ర కణాలు ఉత్పత్తి అవుతాయి. సంపర్క సమయంలో 200-300 మిలియన్ల శుక్రకణాలను పురుషుడు స్ఖలిస్తాడు. ప్రతి ముష్కంలో చాలా లంబికలు ఉంటాయి. ప్రతి లంబికలో ఎక్కువ సంఖ్యలో మెలి తిరిగిన చిన్న చిన్న నాళికలు ఉంటాయి. వీటినే శుక్రోత్పాదక నాళికలు అంటారు. ఈ నాళికలు 80 సెం.మీ. పొడవును కలిగి శుక్రనాళికలోకి తెరచుకొని ఎపిడిడిమిస్‌ను ఏర్పరస్తుంది. ఎపిడిడిమిస్ అనేది చుట్టలు చుట్టలుగా ఉం డే నాళం వంటి నిర్మాణం. ఇది శుక్ర కణాలను తాత్కాలికంగా నిల్వ చేస్తుంది, శుక్ర కణాలు పరిపక్వతకు రావడానికి కావలసిన సమయాన్ని కలుగజేస్తుంది.

శుక్ర వాహికలు: ఎపిడిడిమిస్ నుంచి శుక్రవాహిక బయలు దేరుతుంది. ఇది శుక్ర కణాలను ఎపిడిడిమిస్ నుంచి సంగ్రహిస్తుంది. శుక్ర వాహిక శుక్రాశయం నుంచి వచ్చే వాహికతో కలిసి స్ఖలన నాళాన్ని ఏర్పరుస్తుంది. శుక్రాశయం శుక్రద్రవాన్ని స్రవిస్తుంది. రెండు వైపుల నుంచి వచ్చే స్ఖలన నాళాలు పౌరుష గ్రంథి మధ్య భాగంలో కలిసి ప్రసేకంలోకి తెరచుకుంటాయి.

బాహ్య జననాంగాలు: పురుషులలో ప్రసేకం అనేది మూత్ర జననేంద్రియ వాహికలు కలిసి ఏర్పడిన అంత్యనాళం. ప్రసేకము మూత్రాశయం నుంచి ప్రారంభమై మేహనం ద్వారా వ్యాపించి యూరెత్రమీటస్ అనే రంధ్రం ద్వారా బయటకు తెరచుకుంటుంది. మూత్రం, స్ఖలించిన శుక్రం రెండూ కూడా ప్రసేకం ద్వారా ప్రయాణించి బయటకు వస్తాయి. పురుషులలో మేహనం, ముష్కగోణులు అనే బాహ్యజననాంగాలు ఉంటాయి. మేహనం అనేది మూత్రనాళంగానే కాకుండా, స్త్రీ జీవి యోనిలో శుక్రద్రవాన్ని విడుదల చేసే ప్రవేశాంగముగా పనిచేస్తుంది. మేహనంలోని పృష్ఠభాగంలో కార్పోరా కావెర్నోసా, ఉదరభాగంలో కార్పస్ స్పాంజియోజమ్ అనే స్తంభాకార కణజాలల వలన మేహనం నిటారుగా, కడ్డీలాగా మారి శుక్రమును విడుదల చేయడంలో సహాయపడుతుంది. మేహనం చివర ఉబ్బి బల్బుగా ఉన్న భాగాన్ని గ్లాన్స్ మేహనం అంటారు. గ్లాన్స్ మేహనాన్ని ఆవరించి వదులుగా ఉన్న చర్మాన్ని ప్రెప్యూస్ అంటారు.

> పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ప్రత్యుత్పత్తి ప్రక్రియలో పాల్గొనే అనేక అవయవాలు శ్రోణి ప్రాంతంలో ఉంటాయి. అవి..ఒక జత ముష్కాలు, ఒక జత శుక్రవాహికలు, బాహ్య జననాంగాలు, అనుబంధ గ్రంథులు.

అనుబంధ గ్రంథులు: పురుష అనుబంధ గ్రంథులు వరుసగా..ఒక జత శుక్రాశయాలు, ఒక పౌరుషగ్రంథి, ఒక జత కౌపర్ గ్రంథులు

శుక్రాశయాలు: ఇవి ఒక జత మూత్రాశయం కింది భాగంలో ఉంటాయి. ఇందులో ఉండే శుక్ర కోశాలు శుక్రద్రవాన్ని స్రవిస్తుంది. శుక్ర ద్రవం చిక్కగా జిగటగా ఉంటుంది. 65 శాతం క్షారయుతంగా ఉంటుంది. శుక్రద్రవం క్షారం కావడం వలన యోనిలో ఉండే ఆమ్లత్వాన్ని తటస్థీకరిస్తుంది. శుక్రకణాలకు పోషక పదార్థాలను అందించడంలో, శుక్ర కణాల కదలికలకు శుక్ర ద్రవం ఉపయోగపడుతుంది. శుక్రద్రవంలో ఫ్రక్టోజ్, ప్రోటీన్లు, సిట్రిక్ ఆమ్లం, అకర్బన పదార్థాల పాస్ఫేట్, పొటాషియం, ప్రోస్టాగ్లాండిన్స్, విటమిన్-సి వంటి పదార్థాలు ఉంటాయి.

పౌరుష గ్రంథి: మూత్రాశయం కింద పౌరుష గ్రంథి ఉంటుంది. ఇది ప్రసేకము మొదటి భాగాన్ని ఆవరించి దాని స్రావాలను అనేక వాహికల ద్వారా ప్రసేకంలోకి పంపుతుంది. దీని స్రావం స్వల్ప ఆమ్ల స్థితిలో ఉంటుంది. శుక్ర కణాలను ఉత్తేజపరచడంలో, పోషణ అందించడంలో సహాయపడుతుంది.

కౌపర్ గ్రంథులు: వీటిని బల్బోయురెత్రల్ గ్రంథులుగా కూడా పేర్కొంటారు. ఇవి ఒక జత మేహనం మొదలయ్యే చోట, పౌరుష గ్రంథికి కింద, ప్రసేకానికి ఇరువైపులా ఉంటాయి. వీటి స్రావం తేటగా, జారేట్లుగా, క్షారయుతంగా ఉండి సంపర్కంలో రాపిడిని తగ్గించి శుక్రాన్ని ప్రసేకం ప్రసేకం ద్వారా సులభంగా జారేటట్లుగా చేస్తుంది. ఇవి బఠాణీ గింజ పరిమాణంలో ఉంటాయి.



కె. నాగశేషులు, బయాలజీ ఫ్యాకల్టీ

జగనన్న కాలనీల్లో 'హౌసింగ్' దొంగలు!

సామగ్రి కొనుగోలులో భారీ గోల్‌మాల్.. అధికారులకు రూ.వందల కోట్ల కమీషన్!

- టెండర్లలో నిబంధనలకు పాతర
- ముందే ఆయా కంపెనీలతో ఒప్పందం
- తెరవెనుక ముఖ్యనేత కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారి హస్తం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగనన్న కాలనీల్లో దొంగలు పడ్డారు! అవును.. ఇంకా లక్షలాది ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోయినా, పేదలు గృహప్రవేశాలు చేయకపోయినా 'ఇంటి' దొంగలు దోచుకుంటున్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్‌లోని కొందరు ఉన్నతాధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి పేదలకు అన్యాయం చేస్తున్నారు. దాదాపు 22 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలకు సామాగ్రి (అదర్ మెటీరియల్) కొనుగోలులో భారీ అక్రమాలకు పాల్పడ్డారు. ఒక్కో ఇంటికి రూ.1,12,117 చొప్పున మొత్తం రూ.22 వేల కోట్లకు పైగా విలువైన నిర్మాణ సామగ్రి కొనుగోలు చేశారు. టెండర్ల ఎంపికకు ముందే ఆయా కంపెనీలతో కమీషన్లు, పర్సంటేజీలు మాట్లాడుకుని వందల కోట్లు జేబులో వేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాల వారీగా గోడౌన్లకు తరలించిన సామగ్రిని కొనేవారు లేక తుప్పు పట్టిపోతోంది. చాలా చోట్ల కిందిస్థాయిలోనూ సిబ్బంది చేతివాటంతో గోడౌన్లలోనూ స్టాక్ మాయమవుతోంది. స్టాక్‌కు సంబంధించి లెక్కలు, రికార్డులు సరిగా లేవు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రకటించిన జగనన్న ఇళ్ల నిర్మాణ పథకంలో హౌసింగ్ ఉన్నతాధికారుల నుంచి జిల్లాల్లో పని చేస్తున్న కిందిస్థాయి అధికారులు, సిబ్బంది వరకు ఎవరికి దొరికింది వారు దోచుకుపోతున్నారు. నిర్మాణ సామగ్రి కొనుగోలు, సరఫరాలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీనిపై హౌసింగ్ కార్పొరేషన్ అంతర్గత విచారణ చేపట్టడంతో అక్రమాల డొంక కదులుతోంది. ఇక అధికారులు, సిబ్బంది కంటే ముందే అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు.. జగనన్న కాలనీల స్థలాల కొనుగోలు, చదును పేరిట కోట్లు సొమ్ము చేసుకున్నారు. ఇలా పేదల ఇళ్ల పేరుతో నేతలు, అధికారులు దోచుకోగా.. లక్షలాది మంది లబ్ధిదారులకు ఇంకా సొంతింటి కల నెరవేరనే లేదు.

20 వేల కోట్ల నిర్మాణ సామగ్రి డంపింగ్

పేదల ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీలు, డోర్, విండో ఫ్రేమ్‌లు, శానిటరీ, ఎలక్ట్రికల్ పరికరాలు, రంగులు, వాటర్ ట్యాంకులు తదితర నిర్మాణ సామగ్రిని లబ్ధిదారుల సమ్మతితో మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఇదే అవకాశంగా హౌసింగ్ ఉన్నతాధికారులు వివిధ కంపెనీలతో కమీషన్లు, పర్సంటేజీలు మాట్లాడుకున్నారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా, వెనకా ముందూ ఆలోచించకుండా ఆయా కంపెనీల నుంచి ఒక్కొక్క ఇంటికి రూ.లక్షకు పైగా విలువ చేసే నిర్మాణ సామగ్రిని ఒకేసారి కొనుగోలు చేశారు. ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన 22 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలకు దాదాపు రూ.22 వేల కోట్లకు పైగా విలువైన నిర్మాణ సామగ్రి కొనుగోలు చేశారు. అన్ని జిల్లాలు, మండల కేంద్రాల్లో ఉన్న గోడౌన్లలో డంప్ చేశారు. ఈ వ్యవహారం వెనుక పెద్ద కుంభకోణం ఉందని, ఆయా కంపెనీల నుంచి కమీషన్ల రూపంలో వందల కోట్ల రూపాయలు చేతులు మారినట్లు హౌసింగ్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కొన్ని జిల్లాల్లో హౌసింగ్ ఏఈలు, డీఈఈలు వద్దంటున్నా కమీషన్ల కోసం కొనుగోలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హౌసింగ్ జిల్లా హెడ్స్ ద్వారా ఒత్తిడి తీసుకువచ్చి రిక్వెస్ట్ లెటర్స్ తీసుకుని మరీ ఇంత భారీస్థాయిలో నిర్మాణ సామగ్రిని కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారం వెనుక ప్రభుత్వ ముఖ్యనేత కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారి హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదల ఇళ్ల నిర్మాణంలో జరుగుతున్న అక్రమ వ్యవహారాలపై పూర్తి అవగాహన ఉన్న సదరు అధికారి ఇచ్చిన భరోసాతోనే హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు కమీషన్లు దండుకున్నట్లు సమాచారం.

నిబంధనలు బేఖాతర్

నిర్మాణ సామగ్రిని రివర్స్ టెండరింగ్ ప్రక్రియ ద్వారా లేదా లబ్ధిదారులు ఆమోదం తెలిపిన ఏజెన్సీల ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలనే నిబంధన ఉంది. ఇళ్ల నిర్మాణ ప్రారంభ దశలో అంటే.. 2021 జనవరిలో స్టీల్‌తో సహా 13 రకాల సామగ్రి కొనుగోలుకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు టెండర్లు ఆహ్వానించారు. కానీ కాంట్రాక్టు సంస్థల నుంచి సరైన స్పందన రాలేదు. దీనిని సాకుగా చూపించి నిబంధనలను సవరించి మళ్లీ టెండర్లు పిలిచారు. వివిధ రాష్ట్రాల నుంచి 10 సంస్థలు ముందుకు వచ్చాయి. ఆయా సంస్థల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన నిర్మాణ సామగ్రిని కొనుగోలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. టెండర్లు పిలవడానికి ముందే ఆయా సంస్థలతో అధికారులు కమీషన్లు మాట్లాడుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ సంస్థల నుంచి స్టీల్ సహా 13 రకాల నిర్మాణ సామాగ్రిని రాష్ట్ర స్థాయిలో కొనుగోలు చేసి, లబ్ధిదారులకు సరఫరా చేయాలంటూ జిల్లాల వారీగా హౌసింగ్ గోడౌన్లకు తరలించారు. ఇక కంకర, ఇటుకలు తదితర మెటీరియల్‌తో పాటు ఇసుక రవాణాకు జిల్లా స్థాయిలో టెండరు విధానంలోనే కాంట్రాక్టర్లను ఎంపిక చేయాలని ఆదేశించారు. అయితే ఈ టెండర్లకు కూడా కాంట్రాక్టర్ల నుంచి స్పందన రాలేదు. మొత్తం 9 రకాల నిర్మాణ సామగ్రిని లబ్ధిదారులకు సరఫరా చేయడానికి స్థానిక సరఫరాదారులతో సంప్రదింపులు జరిపి ఉభయులకు అంగీకారమైన ధరలను నిర్ణయించాలని జిల్లా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఇలా రాష్ట్రస్థాయిలో పాటు జిల్లాస్థాయిలో కూడా నిబంధనల ప్రకారం టెండర్లు నిర్వహించకుండా అధికారులకు కమీషన్లు ఇచ్చేవారికి, అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల మేరకు వారి అనుయాయులకు కాంట్రాక్టులు కట్టబెట్టారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఆ మెటీరియల్ మాకొద్దు బాబోయ్

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ సరఫరా చేస్తున్న నిర్మాణ సామగ్రిని తీసుకోవడానికి ఇళ్ల లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ఆ సామగ్రి నాసిరకంగా ఉండటం ఒక కారణమైతే.. మార్కెట్ రేట్ల కంటే అధికంగా ఉండటం మరో కారణం. మార్కెట్ ధరల కంటే తక్కువకు కొనుగోలు చేసి లబ్ధిదారులకు సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించగా.. హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు దీనికి భిన్నంగా అధిక ధరలకు సామగ్రిని లబ్ధిదారులకు అంటగడుతున్నారు. నిర్మాణ సామాగ్రిని ఒక్కో ఇంటికి మొత్తం రూ.1,12,117కు లబ్ధిదారులకు సరఫరా చేస్తున్నారు. దీంతో వాటిని తీసుకునేందుకు లబ్ధిదారులు నిరాకరిస్తున్నారు.

గోడౌన్లలో సామగ్రికి తుప్పు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పినా.. గడచిన మూడున్నరేళ్లలో చచ్చీ చెడి 5 లక్షల ఇళ్లను మాత్రమే నిర్మించగలిగారు. ఇంకా 17 లక్షల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని వారికి ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని చెప్పడంతో రాష్ట్రవ్యాప్తంగా 3.5 లక్షల మందికి పైగా లబ్ధిదారులు ఆప్షన్-3 ఎంపిక చేసుకున్నారు. నిర్మాణ బాధ్యతలను జిల్లాల వారీగా కాంట్రాక్టర్లకు అప్పగించారు. మూడేళ్లగా ఆ మూడున్నర లక్షల ఇళ్లు కనీసం పునాదులు కూడా దాటలేదు. నిర్మాణ సామగ్రిని తీసుకునేందుకు లబ్ధిదారులతో పాటు కాంట్రాక్టర్లు నిరాకరిస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా గోడౌన్లలో నిల్వ చేసిన మెటీరియల్ తుప్పు పట్టి పాడైపోతోంది. దాదాపు మూడొంతులకు పైగా జిల్లాల్లోని గోడౌన్లలోనే ఉండిపోయింది. దీంతో ఉన్నతాధికారుల్లో ఆందోళన మొదలైంది. త్వరలో ఎన్నికలు జరగనుండటంతో రాష్ట్రంలో ప్రభుత్వం మారితే... గోడౌన్లలో నిరుపయోగంగా, తుప్పు పట్టి ఉన్న మెటీరియల్ కొనుగోలుపై విచారణకు ఆదేశించే అవకాశముందని భయపడుతున్నారు. దీంతో ఎన్నికల లోపే ఏదోవిధంగా లబ్ధిదారులకు అంటగట్టాలని ఉన్నతాధికారులు.. అన్ని జిల్లాల హౌసింగ్ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాల వారీగా అంతర్గత విచారణ చేపట్టినప్పుడు విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. ఏ గోడౌన్‌కు ఎంత మెటీరియల్ తరలించారు? ఇప్పటి వరకు లబ్ధిదారులకు ఎంత సరఫరా చేశారు? ఇంకా ఎంత స్టాక్ ఉంది? వంటి వివరాలపై కచ్చితమైన లెక్కలు లేవు. గోడౌన్లలో స్టాక్‌కు సంబంధించిన రికార్డులను కూడా సక్రమంగా నిర్వహించడం లేదని ఉన్నతాధికారులు గుర్తించారు. రూ.కోట్ల విలువైన నిర్మాణ సామగ్రి పక్కదారి పట్టినట్లు గుర్తించారు.

కిందిస్థాయి అధికారులకు నోటీసులు

రాష్ట్రవ్యాప్తంగా హౌసింగ్ గోడౌన్‌లలో ఉన్న నిర్మాణ సామగ్రి నిల్వలకు, ఆన్‌లైన్ రికార్డులలో చూపిస్తున్న దానికి చాలా వ్యత్యాసం ఉండటంతో అవకతవకలు జరిగాయని ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చారు. జిల్లాల్లో పనిచేస్తున్న హౌసింగ్ ఏఈలు, డీఈఈలు, డీహెచ్‌లను బాధ్యులను చేస్తూ వారిపై క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. గోడౌన్లకు తరలించిన సామాగ్రిని సకాలంలో లబ్ధిదారులకు సరఫరా చేయడంలో అధికారుల నిర్లక్ష్యం చూపారని, స్టాక్‌కు సంబంధించి దాదాపు సగానికిపైగా మెటీరియల్‌కు లెక్కలు సరిగా లేవని, రికార్డులను కూడా సరిగా నిర్వహించడం లేదని తమ విచారణలో తేలిందంటూ గృహ నిర్మాణ సంస్థ ఎండీ ఇటీవల జిల్లా అధికారులకు జారీ చేసిన సర్క్యులర్‌లో వెల్లడించారు. వైఫల్యాలకు మండల స్థాయిలో ఏఈలు, డివిజన్ స్థాయిలో డీఈఈలు, జిల్లా స్థాయిలో హౌసింగ్ హెడ్స్ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గోడౌన్లలోని మెటీరియల్ పక్కదారి పట్టినట్లు తేలితే బాధ్యులైన అధికారుల నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేస్తామని స్పష్టం చేశారు. అయితే అవసరం లేకపోయినా కమీషన్లు, పర్సంటేజీల కోసం భారీస్థాయిలో నిర్మాణ సామగ్రిని కొనుగోలు చేసి గోడౌన్లకు తరలించిన ఉన్నతాధికారులు.. ఇప్పుడు తప్పును తమపైకి నెట్టేసి తప్పించుకోవాలని చూస్తున్నారని జిల్లాల్లోని హౌసింగ్ అధికారులు వాపోతున్నారు. దీనిపై సర్కారు దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపిస్తే అసలు వాస్తవాలు బయటకు వస్తాయని చెబుతున్నారు.

బస్సు టికెట్‌తో పాటే శ్రీశైల మల్లన్న దర్శన టికెట్ బుకింగ్!

- ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనానికి ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక రిజర్వేషన్ ఏర్పాట్లు చేయనుంది. బస్సు సీటు రిజర్వేషన్‌తో పాటే స్వామివారి దర్శనానికి టికెట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో వచ్చే భక్తులకు రోజుకు సుమారు 1200 మందికి మల్లికార్జునస్వామివారి దర్శనం ఏర్పాట్లు చేయడానికి దేవస్థానం అధికారులు అంగీకరించినట్లు టీఎస్‌ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో మల్లికార్జున స్వామివారి స్పర్శ దర్శనానికి రూ.500, అతి శీఘ్ర దర్శనానికి రూ.300, శీఘ్ర దర్శనానికి రూ. 200 రుసుము వసూలు చేస్తున్నారు. రోజుకు స్పర్శ దర్శనానికి 200 మంది, అతిశీఘ్ర దర్శనాలకు 500 మంది, శీఘ్ర దర్శనాలకు 500 మంది ప్రయాణికులకు అవకాశం కల్పించేందుకు దేవస్థానంతో టీఎస్‌ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి సంబంధించి సాంకేతికపరమైన ఏర్పాట్లు పూర్తి చేసి దర్శన టిక్కెట్ల రిజర్వేషన్లు ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం టీఎస్‌ఆర్టీసీ ప్రతిరోజూ హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి 33 బస్సులను నడుపుతోంది. అలాగే శ్రీశైలానికి ప్రత్యేకంగా రూపొందించినపది ఏసీ బస్సులను త్వరలోనే ప్రవేశపెట్టడానికి ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది.

తగ్గిన ఉల్లిఘాటు... వెల్లుల్లి పైపైకి
పెద్దఉల్లి వందకు నాలుగు కిలోలు

- చిన్న ఉల్లి కిలో రూ.450కి



అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ఉల్లిపాయల ధర నేలచూపు చూస్తుండగా, వెల్లులి ధర ఆకాశానికి ఎగబాకుతోంది. గత అక్టోబరులో కిలో రూ.180 ఉన్న వెల్లుల్లి జనవరిలో ఒక్కసారిగా రూ.350కి చేరింది. గత వారం మరో రూ.100 పెరిగి, రూ.450కి చేరింది. నాన్‌వెజ్ వంటల్లో మసాలా దినుసుగా వాడే వెల్లుల్లి ఉత్పత్తి ఈ ఏడాది బాగా తగ్గింది. గత అక్టోబరు నుంచి డిసెంబరు వరకు బంగ్లాదేశ్‌తో పాటు ఉత్తరాది రాష్ట్రాల్లో వరదలకు పంటలు దెబ్బతిన్నాయి. మరో వైపు పాకిస్థాన్, రష్యా, ఉక్రేయిన్ వంటి దేశాల్లోనూ వెల్లుల్లికి డిమాండ్ రావడంతో వెల్లుల్లి ధర పెరుగుతోందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఏపీలో వెల్లుల్లి సాగు చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు. తెలంగాణలో కొద్ది విస్తీర్ణంలో పండిస్తున్నారు. మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, హరియాణాలో నీరుల్లి విరివిగా పండుతోంది. తెలుగు రాష్ట్రాలకు ఆయా రాష్ట్రాల నుంచే సరఫరా అవుతోంది. కాగా మూడు నెలల క్రితం పెద్ద ఉల్లిపాయలు క్వింటా రూ.ఐదారు వేలు పలికి, రిటైల్‌గా కిలో రూ.60పైనే అమ్మారు. కానీ ఇప్పుడు ఏపీలో క్వింటా ఉల్లి రూ.1,200, మహారాష్ట్రలో రూ.1,400కు పడిపోయింది. దీంతో రిటైల్ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.30కి లభిస్తుండగా, ఆటోల్లో ఇళ్ల ముందుకు తెచ్చే చిరువ్యాపారులు రూ.100కు 4కిలోలు ఇస్తున్నారు. గత ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం, మిచౌంగ్ తుఫాన్ ఉల్లి ఉత్పత్తిపై ప్రభావం చూపడంతో డిసెంబరు వరకూ డిమాండ్‌గానే విక్రయించారు. అన్ని రాష్ట్రాల్లో ఇప్పుడు మళ్లీ పంట మార్కెట్‌కు వస్తుండటంతో ధర తగ్గుముఖం పట్టినా, వేసవిలో సరఫరా తగ్గి, ధర పెరిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. సాధారణంగా రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో పండించే ఉల్లి.. ఈ ఏడాది వర్షాభావంతో 30% సాగు తగ్గింది. అయితే ఇతర రాష్ట్రాల్లో సాగు సాధారణంగా ఉండటంతో డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా అవుతోంది. నిరుడు ధర పెరిగినప్పుడు కేంద్రం ఉల్లి ఎగుమతులపై 40% సుంకాన్ని పెంచింది. దీంతో ఫలితంగా సామాన్యులకు ఊరటనిచ్చేలా ఉల్లి ధరలు తగుముఖం పట్టాయి.

సుబాబుల్ ధర ఢమాల్!

- టన్నుకు వెయ్యిపైనే తగ్గుదల
- కర్ర రైతుకు తప్పని కష్టాలు
- హామీ ఇచ్చి న్యాయం చేయని జగన్ సర్కార్

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సుబాబుల్ కర్ర ధర పెరిగినట్లే పెరిగి, మళ్లీ తగ్గింది. గత నెలలో టన్ను రూ.5,300 దాకా పలికిన ధర ఇప్పుడు రూ.4 వేలకు పడిపోయింది. గత నాలుగేళ్లు టన్ను రూ.2,500 మించి లేక, కర్ర కట్టింగ్, లోడింగ్ ఖర్చులు కూడా రాక రైతులు నష్టపోయారు. ఈ ఏడాది మార్కెట్ యార్డుల ద్వారా టన్ను రూ.5వేలకు తగ్గకుండా సుబాబుల్ కొనుగోలుకు పలు పేపర్ మిల్లులు ముందుకు రావడంతో రైతులు ఆనందపడ్డారు. కానీ కొంతవరకే ఈ రేటుకు కొని, ఇప్పుడు ధర తగ్గించి అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. మరో వైపు భద్రాచలంలోని ఐటీసీ పేపర్ మిల్లుతో పాటు రాజమం డ్రిలోని ఏపీ పేపర్‌మిల్లు కొనుగోళ్లను తగ్గించేయడం, దళారీలు ధర తగ్గించడంతో సుబాబుల్ రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో వేలాది ఎకరాల్లో సుబాబుల్, జామాయిల్, యూకలిప్టస్ తోటలున్నాయి. కానీ ఈ కర్రకు గత ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర లేక, పేపర్ కంపెనీలు కొనుగోలు చేయక, దళారులు ఇష్టమొచ్చిన ధరకు అడుగుతున్నారని 2019 ఎన్నికల ముందు రైతులు జగన్ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. అప్పుడు టన్ను రూ.5వేలకు తగ్గకుండా సుబాబుల్ కొనుగోలు చేయిస్తానని రైతులకు జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక సుబాబుల్ రైతులకు న్యాయం చేయకపోగా, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని ఉచిత సలహాలిచ్చారు.

శంఖారావంతో వైసీపీలో వణుకు

● మాజీ మంత్రి, సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి, ఫిబ్రవరి 11: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన శంఖారావంతో వైసీపీలో వణుకు ప్రారంభమైందని మాజీమంత్రి, సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల శంఖారావం పేరుతో లోకేశ్ మరో యాత్రకు శ్రీకారం చుట్టడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం, వైసీపీ నేతల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయన్నారు. నారాలోకేశ్ యువగళం పాదయాత్ర సమకాలిన రాజకీయ ఉద్యమాల్లో సరికొత్త అధ్యాయం అన్నారు. యువగళం ఆరంభం నుంచి సీఎం జగన్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా అదరకుండా బెదరకుండా లోకేశ్ పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశారని ఆయన గుర్తుచేశారు. పాదయాత్ర తర్వాత ప్రజలతో మమేకము య్యేందుకు శంఖారావం పేరుతో లోకేశ్ ప్రజల్లోకి వస్తున్నారన్నారు. ప్రజల్లోకి వెళ్ళి జగన్‌రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలను, టీడీపీ మేనిఫెస్టోను కార్యకర్తలకు ప్రజలకు తెలియజేసి చైతన్యం తీసుకు రానున్నారన్నారు. 40 నుంచి 50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయన పర్యటిస్తారని, పాదయాత్రకు వచ్చిన స్పందనే శంఖారావానికి కూడా ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు బాధితులుగా ఉన్నారని, ఈ ప్రభుత్వాన్ని ఎప్పుడెప్పుడు ఇంటికి పంపుదామా? అని ఎదురు చూస్తున్నారన్నారు. చంద్రబాబు చల్లని పాలనకోసం, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు.

నేటి నుంచి సికింద్రాబాద్‌కు రైళ్ల పునరుద్ధరణ

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మౌలాలి - సనత్‌నగర్ బైపాసు రైల్వేలేన్ ఎన్‌ఐ పనుల కోసం గత వారం నుంచి రద్దు చేసిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లని సోమవారం నుంచి పునరుద్ధరించనున్నారు. నెంబరు. 12747/12748 గుంటూరు - వికారాబాద్ - గుంటూరు పల్నాడు ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్- గుంటూరు - సికింద్రాబాద్ వయా కాజీపేట ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు డెల్టా, రేపల్లె ఎక్స్‌ప్రెస్ రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. అలానే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని కాజీపేట వరకే నడిపి వెనక్కు మళ్లిస్తున్నది. కాచీగూడ - మిర్యాలగూడ - నడికుడి మధ్యన నడిచే ప్రత్యేక ప్యాసింజర్ రైళ్లను కూడా ఎన్‌ఐ వర్కులు కారణంగా రద్దు చేసింది. ఈకారణంగా మిగతా రైళ్లలో వారం నుంచి తీవ్ర రద్దీ నెలకొంటున్నది. ముఖ్యంగా శబరి, ఫలక్‌నుమా, నరసపూర్, చెన్నై, నారాయణాద్రి, జన్మభూమి, విశాఖ తదితర రైళ్లలో జనరల్ భోగీలే కాకుండా రిజర్వుడ్ కోచ్‌లు రద్దీగా ఉంటున్నాయి. జనరల్ భోగీల్లో అయితే కాలు తీసి కాలు పెట్టలేని పరిస్థితి. కాగా ఎన్‌ఐ వర్కులు పూర్తి కావడంతో సోమవారం నుంచి ఆయా రైళ్లను పునరుద్ధ రిస్తున్నట్లు రైల్వే శాఖ తెలిపింది.



ఉప్పలపాడు పక్షులకేంద్రాన్ని గుంటూరు జిల్లా లేబర్ కోర్టు జడ్జి డి.తిరుమలరావు ఆదివారం సందర్శించారు. గుంటూరుకి అతి సమీపంలో ఇంత మంచి పార్కు ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆయనకు పక్షుల కేంద్రం లోగో, టీ షర్ట్‌ని అటవీశాఖ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు వెంకటేశ్వరరావు, సంతోష్, పక్షుల కేంద్రం చైర్మన్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. - పెదకాకాని.

సినీరంగంలో లెజెండ్ సూపర్‌స్టార్ కృష్ణ

● ప్రముఖ ఎన్నారై డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

● బుర్రిపాలెంలో కృష్ణ సంస్మరణ సభ



కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆయన సోదరుడు ఆదిశేషగిరిరావు, నాదెండ్ల మనోహర్, పెమ్మసాని చంద్రశేఖర్, రాయపాటి శ్రీనివాస్ తదితరులు

తెనాలి, ఆంధ్రజ్యోతి, ఫిబ్రవరి 11: కుటుంబంలో ఎవరో ఒకరే ఆదర్శవంతులుగా ఉండటం సహజమని, కుటుంబం మొత్తం ఆదర్శ విలువలను పుణికి పుచ్చుకోవడం ఒక్క సూపర్‌స్టార్ కృష్ణ కుటుంబానికే సాధ్యమైందని ప్రముఖ ఎన్నారై డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుర్రిపాలెంలో జరిగిన కృష్ణ సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ నేటి యువతరానికి ఆయన ఆదర్శవంతమైన విలువలు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. అపూర్వ సోదరులంటే ఇతిహాసాల్లో చూసేవారమని, ఆ స్వగ్రామంలోనే కృష్ణ, ఆదిశేషగిరిరావుల సోదరుల ప్రేమ చూస్తే అన్నదమ్ములు ఎవరికైనా అది ఒక మార్గదర్శకమే అవుతుందన్నారు. ఆయన పుట్టిన రోజునే నేను కూడా పుట్టడం నాకు గర్వంగా ఉందని, నేను వేయబోయే సామాజిక, రాజకీయ అడుగులన్ని ఆయన ఆదర్శాలను మార్గదర్శకంగా తీసుకుని ముందుకు వెళతానన్నారు. మాజీ సభాపతి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, సినీ పరిశ్రమలో ఏ కొత్తదనం వచ్చిన, ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం వచ్చిన దానిని సినీ రంగానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తిగా కృష్ణ నిలిచిపోతారన్నారు. ఆయన ఒక లెజండ్ అని, నేటి యువతరానికి మార్గదర్శకులు అవుతారని మనోహర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజకీయ సభ కాకపోయినా పెమ్మసాని వంటి ఔత్సాహిక రాజకీయ వేత్తల కోసం మాట్లాడవలసి వస్తుందని, మన భవిష్యత్ కోసం చంద్రశేఖర్ వంటి వారిని గెలిపించుకోవాల్సిన అవసరం మనపైనే ఉందన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, సూపర్‌స్టార్ కృష్ణ సినీ రంగంలోనే హీరో కాదని సామాజిక, రాజకీయ రంగాల పరంగాను ఆయన ఒక ఆదర్శవంతమైన హీరోగా నిలిచిపోతారన్నారు. ఏ రంగాన్ని ఎంచుకున్నా ఆ రంగంలో విజయవంతమైన పాత్ర పోషించడం, పలువురికి ఆదర్శప్రాయంగా నిలవడం ఆయన ఒక్కడికే సాధ్యమైందన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ, తమకు సూపర్ స్టార్ కృష్ణ కుటుంబంతో ఎనలేని బంధం ఉందని, ఆయన బాటలోనే హీరో మహేష్‌బాబు కూడా పయనిస్తున్నారని, కృష్ణ లేని లోటు రెండు తెలుగు రాష్ట్రాలపైన ఉంటుందన్నారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, అభిమాన సంఘాలకు ఏ హీరో ఇవ్వనంత ప్రాధాన్యాన్ని కృష్ణ ఇచ్చేవారని పేర్కొన్నారు. బుర్రిపాలెం గ్రామానికి ఆయన చేసిన సేవలను స్థానికులు ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా పలువురు నాయకులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, వివిధ ప్రాంతాల కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌లు చరిత్ర సృష్టించబోతున్నారు

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

● జంపని గ్రామంలో టీడీపీలో చేరిన వైసీపీ మైనార్టీ శ్రేణులు



మాజీ మంత్రి ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ మైనార్టీ శ్రేణులు

వేమూరు, ఫిబ్రవరి 11: రానున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కలిసి చరిత్ర సృష్టించబోతున్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని జంపని గ్రామంలో టీడీపీ రాష్ట్ర ముస్లిం, మైనార్టీ విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 40 ముస్లిం కుటుంబాల వారు ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ఒక్క ఛాన్సు అంటూ రాష్ట్రాన్ని, ప్రజలను నట్టేట ముంచిన జగన్మోహనరెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వైసీపీకి అభ్యర్థులు దొరకడం కరువైందని, టీడీపీ తలుపులు తెరిస్తే ఆగే పరిస్థితుల్లో లేరన్నారు. నాలుగోసారి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా తాను నిలబడుతున్నానని తాను చేసిన మంచి పనులను చూసి ఆదరించి గెలిపిస్తారన్న ఆకాంక్షను వ్యక్తపరిచారు. వేమూరులో పోటీ చేసేందుకు సంతనూతలపాడు నుంచి వచ్చిన అశోక్‌బాబుకు స్థానిక ప్రజలు, రాజకీయ వాతావరణంపై అవగాహన లేకుండానే తనపై, విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐకమత్యంతో ఎన్నికల్లో నిలబడే టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో షేక్ మస్తాన్‌వలి, డాక్టర్ షేక్ జాన్‌సైదా, షేక్ ఖాదర్‌వలి, మహబూబ, జానీ, కరిముల్లా, కాలేషా, నాయబ్‌రసూల్, ఫరీద్, ఖాజా, సాహిద్, బాబి, చింతల గోపి, సల్మాన్‌ఖాన్, యూసుఫ్, ఆజాద్, వీర్ అహ్మద్, మౌలాలి, రబ్బాని, సద్దాం, నజీర్, అక్బర్, వెలుతుర్ల శ్రీనివాసరెడ్డి, ముద్రబోయిన సీతయ్య, జానీ, తదితరులు కుటుంబ సభ్యులతో పార్టీ కండువాలు కప్పుకున్నారు. సమావేశంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టిడిపి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మండల పార్టీ అధ్యక్షులు డి.వి.సుబ్బారావు, బిసి సంఘ నాయకులు వాసుదేవరాయుడు, వెలినేని రంగారావు, వేల్పుల రవి, దొడ్డపనేని సుధాకర్, తొలుచూరి కోటేశ్వరరావు, రహంతుల్లా పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి11: పొన్నూరు పట్టణంలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై అర్బన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం ఒంగోలుకు చెందిన సుబ్రహ్మణ్యం (30) గత కొంతకాలంగా పొన్నూరు పట్టణంలో నివసిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి ఇస్లాంపేట్‌లోని అద్దెకు ఉండే గృహంలో సుబ్రహ్మణ్యం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి బంధువులకు ఫోన్‌లో సమాచారం అందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



అఖిల్(ఫైల్ ఫోటో)

బొల్లాపల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని గంగుపల్లి- కంద్రిక మధ్యలో ఇంటర్మీడియట్ విద్యార్థి బందెల అఖిల్(17) ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అఖిల్ సొంత ఊరు ప్రకాశంజిల్లా, పుల్లల చెరువుమండలం, అక్కపాలెం. కాగా గ్రామం నుంచి నాయనమ్మ ఊరైన గంగుపల్లి వచ్చి వెళ్తున్న సమయంలో వినుకొండ నుంచి మన్నేపల్లి తండా వెళ్తున్న ఆర్టీసీ బస్సు కంద్రిక చెరువు మలుపు వద్ద బైక్‌ను ఢీకొనటంతో అఖిల్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈఘటనతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. బొల్లాపల్లి ఎస్‌ఐ చెన్నకేశవులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని యువకుడి మృతి



మహమ్మద్(ఫైల్)

పెదకాకాని, ఫిబ్రవరి11: నంబూరు గ్రామ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి సమీపంలో జరుగుతున్న దీనీ ఇజ్‌తిమ సభలకు వచ్చిన యువకుడు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం జరిగింది. కడప పట్టణం ఆగాడి వీధికి చెందిన షేక్ మహమ్మద్ (34) రెండు రోజుల క్రితం సభలకు వచ్చాడు. స్నేహితులతో కలిసి టిఫిన్ చేసేందుకు జాతీయ రహదారి వద్దకు వచ్చాడు. పని ముగించుకొని తిరిగి సభల వద్దకు వెళ్లేందుకు బయలుదేరాడు. కంతేరు అడ్డు సమీపంలో హైవేపై గుంటూరు నుంచి విజయవాడ వైపు అతివేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన మహమ్మద్ అక్కడికక్కడే మరణించాడు.

వైన్ షాపు వద్ద ఘర్షణ ... ఒకరి మృతి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 11: చిలకలూరిపేట పట్టణంలోని సింగ్‌నగర్ ప్రాంతంలో కొద్దిరోజుల క్రితం జరిగిన గొడవ కేసులో నిందితుడు సురేష్ నాయక్(40) అనే వ్యక్తి మృతి చెందినట్టు పట్టణ పోలీసులు ఆదివారం తెలిపారు. సురేష్ నాయక్‌కు వెంకటేశ్వర్లు నాయక్‌తో మద్యం, డబ్బులు విషయంపై గతంలో గొడవ జరిగిందని పోలీసులు తెలిపారు. ఆ గొడవ సందర్భంగా సురేష్‌నాయక్ తలపై వెంకటేశ్వర్లునాయక్ అనే వ్యక్తి నాపరాయితో బలంగా కొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. తొలుత సురేష్‌నాయక్‌ను స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం అతనిని గుంటూరు ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. చిలకలూరిపేట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో వున్న నిందితుడు వెంకటేశ్వర్లు నాయక్ కోసం రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నారా లోకేశ్ ఆధ్వర్యంలో

వాలీబాల్ పోటీలు ప్రారంభం

● ప్రారంభించిన టీడీపీ నేత నందం అబద్దయ్య

● విజేతగా నిలిచిన జట్టుకు రూ. లక్ష ప్రైజ్ మనీ..

మంగళగిరి, ఫిబ్రవరి11: మంగళగిరి వాలీబాల్ లీగ్-3 టోర్నీ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో మంగళగిరి బైపాస్ రోడ్డులోని నారా లోకేశ్ క్రీడా ప్రాంగణం (బోగి ఎస్టేట్స్)లో ఈ నెల 18వ తేదీ వరకు వాలీబాల్ టోర్నీ జరుగనుంది. మంగళగిరి టీడీపీ, జనసేన నాయకులు క్రీడాకారులను పరిచయం చేసుకుని వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మైదానంలో కొద్దిసేపు వాలీబాల్ ఆడుతూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. మొదటి రోజు రెండు కోర్టుల్లో 8 జట్ల మధ్య పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని ఆకాంక్షించారు. ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో నిర్వహించే ఈ పోటీల్లో 58 జట్లు తలపడుతున్నాయని చెప్పారు. నారా లోకేశ్ ఆధ్వర్యంలో జరుగుతున్న టోర్నీల్లో ఎలాంటి ప్రవేశ రుసుము తీసుకోకుండా అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. వాలీబాల్ టోర్నీలో విజేతగా నిలిచిన జట్టుకు రూ.లక్ష, ద్వితీయ బహుమతి కింద రూ.50 వేలు, తృతీయ బహుమతి కింద రూ.25 వేలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

వేల్పూరు(శావల్యాపురం), ఫిబ్రవరి 11: చింతకాయలు కోసేందుకు వెళ్ళిన వ్యక్తి చెట్టుపై నుంచి జారి కిందపడి మృతిచెందిన ఘటన మండలంలోని వేల్పూరు గ్రామంలో ఆదివారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు వేల్పూరుకు చెందిన మారాసు నాగేశ్వరరావు(64) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. వేల్పూరు నుంచిఇ అలవాల వెళ్ళే మార్గంలో చెరువుకట్టపై చింతకాయలు కోసేందుకు ఆదివారం ఉదయం వెళ్లాడు. చింతచెట్టు పైకి ఎక్కిన నాగేశ్వరరావు కొమ్మపై నుంచి కాలుజారి కింద నేలపై పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగేశ్వరరావు టీడీపీలో చురుగ్గా ఉంటూ పార్టీకి ఎనలేని సేవలందించారు. నాగేశ్వరరావు మృతదేహాన్ని జడ్పీటీసీ పారా హైమావతి, గ్రామ టీడీపీ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలి

● జాతీయ ధోబీ సంఘ్ అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు

● ముగిసిన తిరుపతి నుంచి విజయవాడ కనకదుర్గమ్మ గుడి వరకు పాదయాత్ర



ప్రకాశం బ్యారేజి వద్ద బీసీల మహాపాదయాత్ర

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 11: రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలనే ప్రధాన డిమాండ్‌గా బీసీల మహాపాదయాత్ర నిర్వహించడం జరిగిందని, జాతీయ ధోబీ సంఘ్ అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలని ప్రధాన డిమాండ్‌గా తిరుపతి నుంచి విజయవాడ కనకదుర్గమ్మ గుడి వరకు చేపట్టిన బీసీల మహాపాదయాత్ర సీతానగరం ప్రకాశం బ్యారేజి వద్దకు రాగా అక్కడ నేతలు మాట్లాడారు. నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కనకదుర్గమ్మ గుడి వద్ద మహాపాద ముగుస్తుందన్నారు. రజకులను ఎస్సీల జాబితాలో చేరుస్తామని గత 75 ఏళ్లుగా అన్ని రాజకీయ పార్టీలు చెబుతూ మభ్యపెట్టాయని వ్యాఖ్యానించారు. ప్రతి పార్టీ రజకులను ఎస్సీల జాబితాలో చేర్చే అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని, లేదంటే ప్రజాక్షేత్రంలో ఆయా పార్టీలను రజకుల ద్రోహులుగా చూపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశన శంకరరావు, పారేపల్లి మహేష్, బీసీ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



మందడం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

ప్రజలను మెగా మోసం చేసిన జగన్‌రెడ్డి

● 1517వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 11: ఆంధ్రా ప్రజలను సీఎం జగన్‌రెడ్డి మెగా మోసం చేశారని, ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయకుండా అసమర్థ ముఖ్యమంత్రిగా పేరు గడించారని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు విమర్శించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా ఉండాలని రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు నిరసనలు, దీక్షలు ఆదివారం నాటికి 1,517వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, రాజధాని అమరావతిని కేంద్రం కూడా గుర్తించిందన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కూడా మూడు రాజధానుల అంశం పక్కన పెట్టి అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని మాండమస్ తీర్పునిచ్చిందన్నారు. అయినా జగన్‌రెడ్డి సాధ్యం కాని మూడు పట్టుకొని వేలాడుతున్నాడన్నారు. ఐదుకోట్ల మంది ఆంధ్రులను మోసం చేస్తూ మూడు ముక్కల ఆటకు తెరతీశారన్నారు. అమరావతి అభివృద్ధిని కొనసాగించే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. తుళ్లూరు, మందడం, వెలగపూడి, నెక్కల్లు, అనంతవరం తదిత రాజధాని గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



జ్యోతిప్రజ్వలనతో అలమ్నిమీట్ సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఉపకులపతి శారద జయలక్ష్మీదేవి, పాల్గొన్న కళాశాల పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం

● ఉపకులపతి ఆర్.శారద జయలక్ష్మీదేవి

బాపట్ల రూరల్, ఫిబ్రవరి 11: మానవాళికి అన్నం పెట్టే రైతు ఆదర్శవాది అని, ఇవ్వటంలోని విలువను ప్రతి ఒక్కరు రైతు నుంచే తెలుసుకోవాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆర్.శారద జయలక్ష్మీదేవి అన్నారు. ఆదివారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో అలమ్ని అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్స్ ట్రస్ట్ ఫర్ కాలేజి డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పూర్వవిద్యార్థుల సహకారంతో నూతనంగా నిర్మించిన భవనాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆర్.శారద జయలక్ష్మీదేవి ప్రారంభించారు. అనంతరం బీవీ నాథ్ ఆడిటోరియంలో జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు తమకు విద్య నేర్పిన కళాశాల రుణం తీర్చుకోవటం హర్షణీయమన్నారు. విద్యారంగమైన వ్యాపారరంగమైన శాస్త్రసాంకేతిక రంగమైన అభివృద్ధి చెందాలంటే విద్యార్థుల ద్వారా మాత్రమే సాధ్యపడుతుందన్నారు. బీపీటీ 5204 విత్తు బాపట్ల నుంచి రావటం చాలా గర్వకారణమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని పూర్తి చేయటానికి కృషి చేసిన కళాశాల సోసియేట్ డీన్ వి.శ్రీనివాసరావు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో మరింత అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతి పూర్వవిద్యార్థి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు డి.పాపిరెడ్డి, బి.రంగారావు, భాస్కరరావు, వాణిప్రసాద్, రత్నసుధీర్, నాగేశ్వరరావు, 1980వ బ్యాచ్ విద్యార్థి హరిప్రసాద్ భవన నిర్మాణానికి రూ.50 లక్షల విరాళం ఇవ్వటంతో వీరికి పూర్వవిద్యార్థులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



క్రెడాయ్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఏపీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి తదితరులు

ఘనంగా క్రెడాయ్ నూతన భవన ప్రారంభం

గుంటూరు(కార్పొరేషన్), జనవరి11: గుంటూరు నగరంలోని మహాత్మాగాంధీ ఇన్నర్‌రింగ్ రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన క్రెడాయ్ గుంటూరు చాప్టర్ భవనాన్ని క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి దంపతులచే ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ గుంటూరు చాప్టర్‌కు ఇంతవరకు సొంత భవనం లేదని, దినదినాభివృద్ధి చెందుతున్న క్రెడాయ్ గుంటూరు చాప్టర్‌కు స్థలాన్ని ఇచ్చి, భవనం నిర్మించి ఇవ్వడం మాకుటుంబ సభ్యులందరికీ ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశం నాకు దక్కినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. క్రెడాయ్ గుంటూరు చాప్టర్ మరింత అభివృద్ధి పథంలో నడపడానికి శాయశక్తుల కృషి చేస్తామని తెలిపారు. క్రెడాయ్ నేషనల్ మాజీ ప్రెసిడెంట్, తెలంగాణ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ సొంత భవనానికి స్థలం ఇచ్చి, భవనాన్ని నిర్మించి ఇచ్చిన శివారెడ్డి దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్రెడాయ్ జాతీయ కార్యదర్శి రామిరెడ్డి, బి.రాజా, వైవీ రమణారావు, గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధర పైపైకి..

● గడిచిన రెండు వారాల్లో కేజీకి రూ.100 పెరుగుదల

● రూ.6 వద్ద కొనసాగుతున్న కోడి గుడ్డు ధర

గుంటూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రెండు వారాల్లో చికెన్ ధర దాదాపుగా 50 శాతం పైగా పెరిగింది. ఎండలు పెరుగుతుండటం, ఫారంల నుంచి కోళ్లు తక్కువగా వస్తుండటం, కొన్ని చనిపోతుండటంతో వ్యాపారస్తులు ధర పెంచేశారు. రెండు వారాల క్రితం కేజీ చికెన్ ధర కేవలం రూ.160 మాత్రమే ఉన్నది. అలాంటిది ఈ ఆదివారం కేజీ జిల్లాలో ప్రాంతాన్ని బట్టి రూ.240 నుంచి రూ.260 మధ్యన విక్రయించారు. అయినప్పటికీ ఎప్పటిలానే నగరంలో ఈ ఆదివారం కూడా వ్యాపారాలు కొనసాగాయి. కాగా చికెన్‌తో పోల్చితే చేపలే తక్కువ ధరకు లభ్యమౌతున్నాయి. కేజీ చేపలు రూ.150 నుంచి రూ.200 లోపు ధరకే లభిస్తున్నాయి. పైగా ఇవి ఆరోగ్యానికి మంచిదన్న నానుడి ఉండటంతో ఈ వారం చేపల విక్రయాలు గుంటూరు నగరంలోని మిర్చియార్డు, గుజ్జనగుళ్ల, టీజేపీఎస్ కళాశాల, అమరావతి రోడ్డు, అడపాబజార్ వద్ద జీఎన్‌టీ రోడ్డుపై పెద్దఎత్తున జరిగాయి. చికెన్ ధరకు టైగర్ రొయ్యలు కూడా లభించాయి. మటన్ ధర మాత్రం ఆకాశమే హద్దు అన్నట్లుగా పెరుగుతున్నది. పలుచోట్ల కేజీ రూ.860కి విక్రయించారు. కొన్ని షాపులలో అయితే రూ.900 దాటిపోయింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147,156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

పల్నాడు వార్తలు



ఆర్థిక సహాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

సైదులు కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 11 : పిన్నెల్లి గ్రామానికి చెందిన పొన్నం సైదులు కుటుంబానికి గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రూ.10 వేలు సహాయం అందజేశారు. పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో పొన్నం సైదులు కుటుంబసభ్యులకు నగదును అందజేసి పార్టీ పరంగా అండగా ఉంటానని యరపతినేని భరోసా ఇచ్చారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

మాచర్ల, ఫిబ్రవరి 11 : మండలంలోని ఏడోమైలు గ్రామానికి చెందిన 45 ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వైసీపీ కుటుంబాలు ఆదివారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వీరికి నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి, సైదారావు, సత్యం, హుస్సేన్, నాగరాజు, బ్రహ్మనాయుడు, పెద్దిరాజు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి

వడ్డెర కార్మికుడిని హత్య చేసిన చరిత్ర వైసీపీది

● టీడీపీ నాయకుల ఆరోపణ

దాచేపల్లి, ఫిబ్రవరి 11: వడ్డెర కార్మికులను క్వారీలకు యజమానులు చేస్తామన్నారు....మీరే పెత్తనం...మీదే లెక్క....అంతా మీదే అంటూ వడ్డెర కార్మికులకు మాయమాటలు చెప్పారు....తీరా క్వారీలో పనిచేసిన పనికి కూలీ డబ్బులు అడిగితే పొడిచి హత్యచేశారు.. మీరా మా నేత యరపతినేనిని విమర్శించేది.. మీకు అంత స్థాయి వుందా....అంటూ దాచేపల్లి మండల టీడీపీ నేతలు వైసీపీ నేతలపై విరుచుకుపడ్డారు. ఆదివారం నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ మీరు చేసిన అభివృద్ధి జాడేది....కేంద్రం నిధులతో మంజూరైన ప్రభుత్వ మెడికల్ ఆసుపత్రి, పిడుగురాళ్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి, మాచర్ల-నడికూడి డబులింగ్ రోడ్డు వంటివి తప్ప క్షేత్రస్థాయిలో మీరు చేసిన అభివృద్ధి కనుచూపు మేరలో లేదన్నారు. ఈ రోజు గురజాల నియోజకవర్గంలో జరిగిన ప్రతి అభివృద్ధి నాటి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చేసిందే అని అన్నారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ముగ్గుమిల్లుల్లో కొన్ని పనిచేయలేదని వైసీపీ నేతలు ఆరోపించారు. ఇది పూర్తిగా అవాస్తవమన్నారు. ప్రభుత్వం వచ్చిన ఐదేళ్లలో మద్యం, పేకాట, అక్రమ క్వారీలు, గంజాయి, ఖైనీలు, అనుమతిలేని మద్యం, ఇసుక అన్ని అవినీతికి వైసీపీ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని విమర్శించారు. సమావేశంలో గుంటుపల్లి నాగేశ్వరరావు, వేముల తిరుమలకుమార్, బెల్లంకొండ భద్రి, తంగెళ్ల శ్రీనివాసరావు, నర్రా పుల్లయ్య, రుద్రాల అచ్చారావు, మందపాటి దుర్గారావు, తోట నాగేశ్వరరావు, బొమ్మిరెడ్డి నారాయణ, గంధం నాగరాజు, ముశ్యం శ్రీను, వేముల కృష్ణ, పగడాల భాస్కరరావు, సొసైటీ నారాయణ, బొమ్మిరెడ్డి కొండలు, తోట మధు, బొమ్మిరెడ్డి రామకృష్ణ, షేక్ అబ్దుల్లా, అహ్మదా, పఠాన్ మీరావలి తదితరులున్నారు.

పోటీ పరీక్షలలో వివేకానంద విద్యార్థుల ప్రతిభ

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 11 : ఏఐఎంఈడీ పోటీ పరీక్షలలో స్థానిక వివేకానంద స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఏఐఎంఈడీ అసోసియేషన్ ఫర్ ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ మేథమేటిక్స్ ఎడ్యుకేషన్, విజయవాడ వారిచే నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షలో ఉమ్మడి జిల్లాలో 12 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వారందరూ స్థానిక వివేకానంద పాఠశాల విద్యార్థులు కావడం విశేషం. విజయవాడ కొత్తపేటలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారికి ప్రతిభా పురస్కారాలను అసోసియేషన్ లైఫ్‌టైమ్ అధ్యక్షులు భవనారి సత్యనారాయణ, అధ్యక్షులు టి.మాధవిలత, జె.నాగేశ్వరరావు, జేసు పాదం, ఆత్మకూరి రామకృష్ణ, ఎన్.శ్రీనివాసరావు,నరసింహారావు అందజేశారు.

కొండవీడు కోట సందర్శన

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 11 : మండల పరిషత్ ఎల్‌ఈ పాఠశాల విద్యార్థులు ఆదివారం కొండవీడు ప్రాంతాన్ని సందర్శించారు. రెండు రోజులుగా కొండవీడు ఫెస్ట్ కార్యక్రమం సందర్భంగా పాఠశాల విద్యార్థుల మానసిక ఉల్లాసానికి కొండవీడు ప్రాంతాన్ని సందర్శించడం జరిగిందని పాఠశాల హెచ్‌ఎం పి.స్వామి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, అహ్మద్‌బాషా, కె.విజయకుమారి, సుజన పాల్గొనగా, ఎస్‌ఎంసీ చైర్మన్ కొత్త రామకృష్ణ రవాణా భోజన సదుపాయాన్ని అందించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 11 : పిడుగురాళ్ల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శంకర కంటి వైద్యశాల వైద్యులతో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత కంటి వైద్యశిబిరంలో పెదకాకాని శంకర కంటి వైద్యశాల వైద్యులు సుమారు 350 మందిని పరీక్షించి 200 మందికి ఆపరేషన్లు చేయాల్సి వస్తుందని గుర్తించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎ.గురవయ్య, గర్రె సుబ్రహ్మణ్యం, పసుమర్తి సుబ్రహ్మణ్యం, కోట సుబ్బారావు, కాకుమాను శ్రీనివాసరావు, జూల కంటి సుబ్రహ్మణ్యం, గుండా అశోక్, యేచూరి రాధాకృష్ణ, జివి నరసింహారావు, కోట రమేష్, పాపయ్య గుప్తా, ముత్తారెడ్డి, కొత్త సత్యం, యక్కల కాశి, అనంత రామయ్య, హరి కృష్ణ పాల్గొన్నారు.

మహాశక్తి పథకంతో టీడీపీకి అధికారం : కన్నా



మినీ మ్యానిఫెస్టోను మహిళలకు అందజేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ళ ఫిబ్రవరి 11 : మహాశక్తి పథకంతోనే టీడీపీ అధికారంలోకి వస్తుందని మాజీ మంత్రి, సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కుందురువారిపాలెంలో ఆదివారం కన్నా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ అభివృద్ధిని తుంగలో తొక్కి రాష్ట్ర సంపదను జగన్ అండ్ కో దోచుకుతిన్నారన్నారు. తన అనుచరులతో సొంత మద్యం తయారు చేయించి పేద ప్రజల రక్తమాంసాలతో జగన్ వ్యాపారం చేస్తున్నాడని కన్నా ఆరోపించారు. ఇంటింటికీ తిరిగి మహాశక్తి కరపత్రాలను మహిళలకు అందించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి, దివంగత స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముందుగా టీడీపీ, జనసేన నాయకులు ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, రావిపాటి మధుబాబు, నార్నెపాడు సర్పంచ్ యలమందరావు, తురకపాలెం సర్పంచ్ మల్లవరపు చంద్రశేఖర్, నానయ్య, డబ్బుకొట్టు నారాయణ, బండ్లమూడి శ్రీనివాసరావు, బి.మల్లికార్జున రావు, బండ్లమూడి అప్పారావు, అత్తోట వెంకటకృష్ణ, గంగారాం ఖాశిం, కందుల మనోజ్, మహబూబ్ సుభాని, పఠాన్ లీలాఫర్ తదితరులున్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

గురజాలటౌన్, ఫిబ్రవరి 11 : పట్టణంలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో ఆదివారం నవులూరి బ్రహ్మ, అతని బృందం ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా హాజరైన గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిఖిల్‌ను దుశ్శాలువాలతో సన్మానించారు. వైద్యులు గోనుగుంట్ల రామ్‌కిషన్, మనోజ్‌కుమార్, లోకేష్, శ్రీకాంత్, సాయి సుస్మి, బాజీబాబు, నాగేశ్వరరావు, ఆళ్ల స్థిమిత, బండ్ల రామచంద్, నవులూరి రామకృష్ణలు 350 మందిని పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పులుకూరి కాంతారావు, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి హనుమంతురావు, కౌన్సిలర్లు నేలవల్లి బొల్లయ్య, చాగంటి శ్రీను, కొట్టే శ్రీను, పి.నాగేశ్వరరావు, పి.శివనాగు, చావా రామారావు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నిఖిల్

నిదానంపాటి అమ్మవారిని దర్శించుకున్న న్యాయాధికారి శారద

దుర్గి, ఫిబ్రవరి 11: మండలంలోని అడిగొప్పులలో ఉన్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని ఆదివారం మాచర్ల కోర్టు న్యాయాధికారి శారద దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. ఆలయ ప్రాముఖ్యతను సిబ్బంది వివరించారు. కాగా ఏవోగా ఇక్కడ విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న నరసింహబాబుకు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న న్యాయాధికారి శారద

క్రైస్తవ సంఘ నేతల మౌన ప్రదర్శన, రాస్తారోకో

రెంటచింతల, ఫిబ్రవరి 11 : క్రైస్తవ సంఘ నేతలపై దాడులు నిరశిస్తూ రెంటచింతలలోని ఆర్‌సీఎం చర్చి నుంచి పురవీధుల్లో ఆదివారం వందలాది మందితో మౌన ప్రదర్శన అనంతరం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి తమ నిరసనను వ్యక్తపరిచారు. చర్చి పెద్దలైన ఓరుగంటి ఇన్నారెడ్డి, వి.విజయభాస్కరరెడ్డిలపై ఈనెల 4న భౌతికదాడులు పాల్పడమే గాకుండా కంప్యూటర్ సెంటరుని ధ్వంసం చేయడంతో నగదును, బంగారు చైన్‌ను కోల్పోయారు. ఈ చర్యను నిరశిస్తూ క్రైస్తవ సమాజానికి చెందిన పురుషులు, మహిళలు, చిన్నారులు వందలాది మంది రహదారిపై నిరశన గళం విప్పారు. రాస్తారోకో వలన ట్రాఫిక్ స్తంభించింది. దోషులను శిక్షించాలని, ఇటువంటి దాడులు మళ్లీ జరగకుండా చూడాలని బాధితులు వేడుకున్నారు.



మాచర్ల-గుంటూరు రహదారిపై రాస్తారోకో చేస్తున్న క్రైస్తవ సంఘ నేతలు

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

విజయపురిసౌత్, ఫిబ్రవరి 11: ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని మాచర్ల రూరల్ సీఐ సురేష్ అన్నారు. ఆదివారం మాచర్ల మండలం పశువేములలో వైసీపీ నేత పండ్ల మంగయ్య ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత హెల్మెట్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం హెల్మెట్లను ఉచితంగా వాహన చోదకులకు అందించారు. కార్యక్రమంలో విజయపురిసౌత్ ఎస్ఐ డి.వెంకటకొండారెడ్డి, మట్టపల్లి నారాయణ, పండ్ల అంజయ్య, బి.సత్యనారాయణ, మట్టపల్లి నాసరయ్య, పుల్లయ్య, సర్పంచ్ దేవదానం, కర్ర చిన రంగయ్య పాల్గొన్నారు.

అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయాలి

రెంటచింతల, ఫిబ్రవరి 11 : ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో జీవో 56 ద్వారా తీసుకొచ్చిన రెండేళ్ల అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు నాసరయ్య, డాక్టర్ చిన్నమ్మ కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ గతంలో టీచర్ల పోరాట ఫలితంగా రద్దు చేసిన అప్రెంటీస్ విధానాన్ని ప్రవేశ పెట్టడం సరికాదన్నారు. డీఎస్సీలో పోస్టులు పెంచాలని ఓపీఎస్ పెంచాలని కోరారు.

రేపు సమష్టి దివ్య బలిపూజ

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 11 : పట్టణంలోని నిత్యసహాయమాత మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో సమష్టి దివ్య బలిపూజ నిర్వహించనున్నారు. ఆర్‌సీఎం స్కూల్ నుంచి ఒత్తుల సమర్పణ ఊరేగింపు జరపనున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహిళలకు ఉదయం ముగ్గుల పోటీలు, సాయంత్రం మండల పరిధిలోని పదో తరగతి విద్యార్థులతో నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని విచారణ గురువులు కొమ్మారెడ్డి రఫెల్‌రెడ్డి కోరారు.

నేడు సత్రశాల ట్రస్ట్ బోర్డు సమావేశం

రెంటచింతల, ఫిబ్రవరి 11 : మండలంలోని సత్రశాలలో సోమవారం ట్రస్టుబోర్డు సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి తెలిపారు. మార్చి 8వ తేదీన జరగబోయే మహా శివరాత్రికి సంబంధించి ఏర్పాట్లపై చర్చించనున్నారు.



ధ్వజ స్తంభం వద్ద పూజలు చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ, నాగోతు శౌరయ్య తదితరులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ

నకరికల్లు, ఫిబ్రవరి 11 : నకరికల్లులోని రామదాసు కాలనీ ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త జనంతో ఆలయానికి చేరుకొనే రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. సత్తెనపల్లి నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య ధ్వజ స్తంభం వద్ద పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు శేష వస్త్రంతో సత్కరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల శెట్టి వెంకటరావు, షేక్ అలీ బాషా, నాదెండ్ల సత్యనారాయణ, రావెళ్ల గోపీకృష్ణ, సంగుల అప్పారావు, ఆకుల వెంకటేశ్వర్లు, డీకొండ మహా నంది, కే.వెంకయ్య, ఆలయ కమిటీ సభ్యులు మల్లాల రాఘవరావు, కప్పిశెట్టి వెంకటేశ్వర్లు, బైరెడ్డి శివారెడ్డి, మల్లాల దానయ్య, ఇర్ల అంకమరాజు, కాళంగి సీతారామయ్య, చట్టు వెంకటేశ్వర్లు, చల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలువురికి కన్నా పరామర్శ

నకరికల్లు, ఫిబ్రవరి 11 : మండలంలోని దేచవరం గ్రామానికి చెందిన గంగవరపు శ్రీనివాసరావును నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు నాగోతు శౌరయ్య, కంకణంపాటి వీరయ్య, కందుల నాగార్జునరెడ్డి, బోడపాటి రామారావు, కందుల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతున్న గుండ్లపల్లి టీడీపీ గ్రామ అధ్యక్షుడు కరాలపాటి వలిని కూడా కన్నా లక్ష్మీనారాయణ, నాగోతు శౌరయ్య పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మహాశక్తి నిర్వహించిన మహిళలకు చీరల పంపిణీ

నకరికల్లు, ఫిబ్రవరి 11 : టీడీపీ మహాశక్తి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొర్రెపాటి సుశీలమ్మ, జిల్లా మహిళా కార్యదర్శి ఆలూరి ఆండాలు, నకరికల్లు, రాజుపాలెం, మండల మహిళా అధ్యక్షురాళ్ళు దూదేకుల హుస్సేన్‌బీ, నెల్లూరి అహల్యారాణిలకు ఆదివారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య లు చీరలు పంపిణీ చేశారు.

ఉచిత రక్త పరీక్షల శిబిరం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 11 : పట్టణంలోని 15వ వార్డులో టీడీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత రక్త పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామ స్వామి, టీడీపీ నాయకులు చౌట శ్రీనివాసరావు, ఎలినేడి లక్ష్మీ తులసీ, నోముల ప్రకాష్, 15వ వార్డుకు చెందిన టీడీపీ నేతుల పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సత్యం మృతి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 11 : మండలంలోని ధూళిపాళ్ళ మాజీ సర్పంచ్ చిలకా సత్యం(65) ఆదివారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల కాలంలో జనసేన పార్టీలో చేరారు. చిలకా సత్యం మరణం బాధాకరమని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు, పార్టీ మండల అధ్యక్షుడు నాదెండ్ల నాగేశ్వరరావు అన్నారు. పలువురు నేతలు సత్యం మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమవారం సత్యం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం : అంబటి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 11 : క్రీడలతో శారీరక దారుఢ్యం పెరుగుతుందని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలో ఆదివారం సాయంత్రం మండల స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు ఆయన బహుమతులను అందించారు. కబడ్డీ భారతీయ గ్రామీణ క్రీడ అన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

న్యాయ సలహా కమిటీ చైర్మన్‌గా దివ్వెల

సత్తెనపల్లి, ఫిబ్రవరి 11 : పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం న్యాయ సలహా కమిటీ చైర్మన్‌గా పట్టణానికి చెందిన దివ్వెల శ్రీనివాసరావును నియమిస్తూ సంఘ జిల్లా అధ్యక్షుడు అత్తలూరి సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దివ్వెల శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘ నాయకుల నమ్మ కాన్నివమ్ము చేయకుండా సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. దివ్వెల శ్రీనివాసరావు రెండు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.

గ్రోమోర్ కేంద్రం ప్రారంభం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 11 : కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో మన గ్రోమోర్ కేంద్రాన్ని ఆదివారం అచ్చంపేట రోడ్డులోని శివాలయం వద్ద కోరమండల్ రిటైల్ జోనల్ మేనేజర్ ఎం సురేష్ ప్రారంభించారు. రైతులకు గ్రోమోర్ సెంటర్ ద్వారా అవసరమైన సేవలు అందించటం జరుగుతుందన్నారు. కంపెనీ జోనల్ మేనేజర్ భాను ప్రకాష్, హెచ్‌ఆర్ షణ్ముకరావు, మేనేజర్ జీవీ రమణలు మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లోని రైతులు గ్రోమోర్ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ప్రారంభ కార్యక్రమంలో పలువురు కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా గేరా మోహన్‌రావు



మోహనరావు

నకరికల్లు, ఫిబ్రవరి 11 : ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా గేరా మోహనరావు ఎంపికైనట్టు ఎస్టీయూ నకరికల్లు మండల అధ్యక్షుడు చిమటా నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మేడికొండ పరమేశ్వర రెడ్డి, రాంబాబు, సీహెచ్ వెంకటేశ్వర్లు, సుందరరావు, గౌస్, మస్తాన్‌వలి అభినందనలు తెలిపారు.



టీడీపీ ముఖ్య నేతలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

ఎన్నికల హామీలను అమలు చేయలేని అసమర్థ సీఎం

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, ఫిబ్రవరి 11 : ఎన్నికల హామీలను అమలు చేయలేని అసమర్థ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గుంటూరులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం పెదకూరపాడు నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. శ్రీధర్ మాట్లాడుతూ మన ఇంటికి మన కొమ్మాలపాటి కార్యక్రమంలో భాగంగా బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ అనే సూపర్-6 పథకాలను ఇంటింటికి వెళ్ళి వివరించాలని అన్నారు. సీఎం జగన్ ఎన్నికలకు ముందు ప్రజలకు మోస పూరిత మైన వాగ్దానాలు, మద్యపాన నిషేధం, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తానని, పెట్రోల్, డీజిల్, ఇంటి పన్ను, నీటి పన్ను అంటూ అనేకమైన వాటి పన్నులు తగ్గిస్తానని అమలు చేయటం చేతకాని ముఖ్యమంత్రి అన్నారు. ప్రతి గ్రామంలో బూత్ కమిటీ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు నాయకులు కలసి కట్టుగా ఎప్పటికప్పుడు ఓటరు లిస్టుపై వెరిఫికేషన్ చేసుకుంటూ వైసీపీ వారి దొంగ ఓట్లను తొలగించటానికి ఫారం-7ను వీఆర్‌వోకు ఇవ్వాలని, నూతన ఓట్ల కోసం ఫారం-6 ఇవ్వాలని ఆయన సూచించారు. సమావేశంలో పెదకూరపాడు, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలాలకు చెందిన టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

జగన్ అరాచకాలపై లోకేశ్ పూరించిన నాదమే శంఖారావం



బాజీ చౌదరి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 11 : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచ కాలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నినాదమే శంఖారావం అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటించి ప్రభుత్వ దౌర్జన్యాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతులను చేస్తారన్నారు. వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేంగా ప్రజలకు భరోసా లోకేశ్ కల్పించనున్నారన్నారు. దశాబ్ద కాలంగా ఆయన రాజకీయాల్లో రాణిస్తున్నారన్నారు. రాష్ట్ర మంత్రి హోదాలో కేంద్ర ప్రభుత్వం నుంచి అనేక అవార్డులు తీసుకున్న ఘనత లోకేశ్‌కు దక్కుతుందన్నారు. ఐటీ, పంచాయతీరాజ్ లాంటి భిన్నమైన రెండు శాఖలను సమర్థవంతంగా నిర్వహించి న నాయకుడు లోకేశ్ అన్నారు. శంఖారావం జగన్‌కు నిద్రలేని రాత్రులను మిగల్చనుందన్నారు. శంఖారావంలో కార్యకర్తలను, ప్రజలను కలుసుకోవటం ద్వారా టీడీపీ మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఘనంగా గంగా, పార్వతి శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన



కన్నా లక్ష్మీనారాయణను శాలువాతో సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాజుపాలెం, ఫిబ్రవరి 11 : మండలంలోని కొత్తపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీశ్రీశ్రీ గంగా, పార్వతి సమేత శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్న ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. బ్రహ్మశ్రీ పోతులూరి శివరామాచార్య స్వామి సిద్ధాంతి చేతుల మీదుగా ఆదివారం ఉదయం 11:07 నిముషాలకు ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కన్నా లక్ష్మీనారాయణను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించా రు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, మాజీ ఎంపీపీ నర్రా బాబురావు, తోట వెంకట శివ, నల్లమోతుల శ్రీనివాసరావు(వాసు), రైతు విభాగం నాయకులు గుర్రాల జగన్, పాడి పెద్ద వెంకటేశ్వర్లు ఉన్నారు.

వాసవి అమ్మవారికి ప్రత్యేక అలంకారం



వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పూలతో అలంకారం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 11 : పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా ఆలయ కమిటీ నిర్వాహకులు అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని సందర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● అచ్చంపేట, ఫిబ్రవరి 11 : అచ్చంపేటలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఆదివారం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్యుల కుల దేవతగా, తెలుగింటి ఆడపడుచుగా వెలుగొందుతున్న వాసవి అమ్మవారి త్యాగమునకు ప్రతీకగా కన్యకా మాతగా వెలసిన అమ్మ వారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు సూరె వెంకట మణికంఠ, ఉపాధ్యక్షుడు సూరె రామలింగ స్వామి, కార్యదర్శి అనుమోలు శేష గిరిరావు, కోశాధికారి సూరె వెంకట సుబ్బారావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

● రెంటచింతల, ఫిబ్రవరి 11 : రెంటచింతలలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శ్రీ వాసవి మాత ఆత్మార్పన దినోత్సవాన్ని ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపారు. ఆలయ పూజారి శర్మ నేతృత్వంలో అభిషేకాలు, హోమాలు చేయడంతో పాటు ఆలయ ప్రాంగణంలో అమ్మవారిని ఊరేగించారు. గోమాత పూజ ప్రత్యేకంగా జరిపి విద్యానిధి పథకం కింద ఏడుగురు విద్యార్థులకు రూ.28 వేలు అందచేశారు. ఆలయ చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు నేతృత్వంలో భారీగా అన్నదానం చేశారు. భక్తులు గణనీయంగా హాజరయ్యారు.

పదో తరగతి టాలెంట్ టెస్టులో గాయత్రికి ప్రథమ స్థానం



పి.గాయత్రి

క్రోసూరు, ఫిబ్రవరి 11 : సత్తెనపల్లి డివిజన్ స్థాయిలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్టులో క్రోసూరు విద్యార్థిని పాలపర్తి గాయత్రి ప్రథమ స్థానంలో నిలిచింది. ఆమె క్రోసూరు జై భారత్ హైస్కూల్‌లో చదువుతుంది. మేథ్స్, ఫిజికల్ సైన్స్, బయాలజీ సబ్జెక్టుల్లో ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన గాయత్రికి రూ.15 వేల నగదుతో పాటు జ్ఞాపికను కూడా నిర్వాహకులు అందజేశారు. డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన గాయత్రిని జై భారత్ హైస్కూల్ డైరెక్టర్ టి.జయసేంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయులు నజీర్, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

అచ్చంపేటలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ

అచ్చంపేట, ఫిబ్రవరి 11 : అచ్చంపేటలోని వాగొడ్డు కాలనీలో ఆదివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహాశక్తి, దీపం పథకం, బీసీలకు రక్షణ చట్టం, అన్నదాత పథకం, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు తదితర అంశాలను వివరించారు. ఇంటింటికి తిరుగుతూ పథకాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బత్తుల శ్రీనివాసరావు, వెనిగండ్ల కోటయ్య, తాళ్ళూరి సుబ్బారావు, నందెపో గు సామేలు, ఎస్‌కే కాసుల, తిరువాయిపాటి ఆంజనేయులు, కోట చంటి, మేకల హనుమయ్య, నెల్లూరి వెంకటయ్య పాల్గొన్నారు.

మునగోడులో పల్లెకు పోదాం

అమరావతి, ఫిబ్రవరి 11 : భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మునగోడు గ్రామంలో ఆదివారం పల్లెకు పోదాం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికి తిరిగి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టి.వెంగళరెడ్డి, జయకుమార్, ఎం.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్రభుత్వ పథకాలతో ప్రజల్లో సంతృప్తి

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట మండలం పెదరెడ్డిపాలెంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

పెదరెడ్డిపాలెం (నరసరావుపేట రూరల్), ఫిబ్రవరి 11: పేద ప్రజల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందుతున్నాయని ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నరసరావుపేట మండలం పెదరెడ్డిపాలెం గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో నూతంగా నిర్మించిన ఎస్టీ కమ్యూనిటీ హాలును శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకపోతే ఆయా గ్రామాలలోని వలంటీర్లు, గ్రామస్థాయి నాయకులను కలసి వివరించాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో పీఎన్‌సీ అండ్ కేఆర్ విద్యార్థుల ప్రతిభ



ఎస్ సువర్ణ, ఆసియా, కీర్తిశ్రీ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 11: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ మూడో సెమిష్టరు ఫలితాలలో పీఎన్‌సీ అండ్ కేఆర్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ మేజర్ జీ వెంకటేశ్వరావు ఆదివారం తెలిపారు. బీఎస్సీ ఎంబీసీలో సిక్కా సువర్ణ 744/800, బీఎస్సీ బీజెడ్‌సీలో షేక్ అసియా 712/800, బీసీఏలో ఆముదాల కీర్తిశ్రీ 700/800, బీకామ్ కంప్యూటర్స్‌లో అనుముల నాగలక్ష్మి 611/700, బీఎస్సీ ఎంపీసీఎస్‌లో పోలేబోయిన అనంతలక్ష్మి 620/750, బీఏ ఈపీసీఎస్‌లో తిరిమేళ్ళ హనుమంతురావు, బీఏ ఈహెచ్‌పీలో షేక్ ఇర్ఫాన్ పర్వీన్ 519/650 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ప్రేమచంద్, ట్రెజరర్ డాక్టర్ అన్నపూర్ణమ్మ, జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాసప్రసాదు, వైస్ ప్రిన్సిపాల్ బీ రాధాకృష్ణమూర్తి, ఎన్ మల్లికార్జునరావులు అభినందించారు.

గుండెపోటుతో కళాకారుడు మృతి



పూల చిన్న

చిలకలూరిపేట, ఫిబ్రవరి 11: పట్టణంలోని సుబ్బయ్య తోటకు చెందిన పూల చిన్న (37) (వేణుగోపాల్) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. చిన్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో అమ్మవారి వేషధారణల్లో కన్పిస్తూ రక్తి కట్టించేవాడు. రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రేక్షకులను మెప్పించేవాడు. గతరాత్రి స్థానిక మారుతీనగర్‌లో పోలేరమ్మ అమ్మవారి వార్షికోత్సవ మహోత్సవంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న అతడు ఒక్కసారిగా నృత్యం చేస్తూ కుప్ప కూలిపోయాడు. స్థానికులు చికిత్స కోసం అతడిని హుటాహుటీన ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినప్పటికీ అతడు మృతి చెందినట్టుగా సమాచారం. ఈ సంఘటనతో అతడి కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.



గుంటుపాలెంలో ఆర్‌బీకే శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

సచివాలయాలతో గడప గడపకు సంక్షేమం

● ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం, ఫిబ్రవరి 11: వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థలతో గడప గడపకు సంక్షేమ పాలనను అందిస్తున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని కారుమంచి సొసైటీ ఆధ్వర్యంలో గుంటుపాలెం-కారుమంచి గ్రామాల మధ్య నూతనంగా నిర్మించనున్న పెట్రోల్ బంక్ శంకుస్థాపన కార్యక్రమాన్ని, గుంటుపాలెం సమీపంలో నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్, గుంటుపాలెంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసాకేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెట్రోల్ బంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నూతన భవనాల శిలాఫలకాలు ఆవిష్కరించి రిబ్బన్ కట్ చేసి భవనాలను ప్రారంభించారు. ఈపూరు మార్కెట్‌యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, వైసీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, సొసైటీ చైర్మన్‌లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా సాంబశివరావు, సీనియర్ నాయకుడు గుత్తా కోటేశ్వరరావు, కావూరి మాబుసుభానయ్య, ఎంపీడీవో కవితాచౌదరి, ఏవో ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పూర్వవిద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ఘనంగా లయోలా పాఠశాల గోల్డెన్ జూబ్లీ

వినుకొండ, ఫిబ్రవరి 11: మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలోని లయోలా ఉన్నత పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు 2వ రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1971 నుంచి నేటి వరకు పాఠశాలలో చదివిన విద్యార్థులు ఒకరినొకరు కలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తన చిన్ననాటి గుర్తులను నెమరవేసుకున్నారు. అదేవిధంగా వివిధ రంగాల్లో స్థిరపడిన ప్రముఖులను కరస్పాండెంట్ ఫాదర్ జ్ఞానదేవన్, పాఠశాల హెచ్‌ఎం ఫాదర్ రవి ఘనంగా సన్మానించారు. గోల్డెన్ జూబ్లీ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పూర్వవిద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రోజంతా పాఠశాల ఆవరణలో గడిపిన పూర్వవిద్యార్థులు ఎన్నో మధుర స్మృతులను మదిలో నింపుకొని వీడ్కోలు పలికారు.

మాజీ ప్రధాని పీవీకి భారతరత్న ప్రకటించడంపై హర్షం



నిరుపేద కుటుంబానికి బియ్యం, నూతన వస్త్రాలను అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

వినుకొండ, ఫిబ్రవరి 11: ఇటీవల కేంద్ర ప్రభుత్వం మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న బిరుదును ప్రకటించడంపై వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పి.వి.నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో ఆర్థికంగా వెనుకబడిన ఆరు బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో చింతలచెర్వు రాఘవేంద్రరావు, నారాయణ రామ్మోహనచార్యులు, నారాయణరావు, అప్పలరాజు నాగేశ్వరరావు, పోట్లూరి వరలక్ష్మమ్మ, చింతలపూడి బాబుబాలాజీ, ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు, శర్మ, చంద్రమౌళి, రాధాకృష్ణమూర్తి, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పరిధిలో నివాసం... ఓటు హక్కుకు నోచని వైనం

● ఓటుహక్కు రాని పట్టణ శివారు ప్రాంత ప్రజలు

● పిల్లల సర్టిఫికెట్ల కోసం ఇక్కట్లే



పట్టణ సమీపంలోని హస్తినాపురం, అక్కడ నిర్మించిన భవనాలు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 11: లక్షల రూపాయలు వెచ్చించి వినుకొండ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి నిర్మాణాలు చేపట్టినా ఓటు హక్కు మాత్రం అధికారులు ససేమిరా అంటున్నారు. వినుకొండ రెవెన్యూ విలేజీ పరిధిలోని వెంకుపాలెం, విఠంరాజుపల్లి, బ్రాహ్మణపల్లి, చాట్రగడ్డపాడు పంచాయతీల పరిధిలో పంట పొలాలను ప్లాట్‌లుగా మార్చి రియల్టర్లు రియల్‌ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తున్నారు. స్తోమతను బట్టి ప్లాట్లు కొనుగోలు చేసిన సామాన్యుడు మొదలుకొని ఉద్యోగస్తుడి వరకు నూతన వెంచర్లలో ఇంటి నిర్మాణాలు చేపట్టి జీవనం సాగిస్తున్నారు. రియల్టర్లు వినుకొండ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు అయినప్పటికీ పంచాయతీ పరిధిలో భూములు ఉండటంతో రియల్టర్లు పంచాయతీల్లో ప్లాట్ల అప్రూవల్ తీసుకొని విక్రయాలు చేపట్టారు. పంచాయతీల్లో అప్రూవల్ ఉండటం వల్ల నూతనంగా ఏర్పాటుచేసిన వెంచర్లకు మౌలికసదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులపై ఉందని, పన్ను పంచాయతీకి కడితే ఓటు మున్సిపాలిటీ పరిధిలో ఓటు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. దీంతో పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో కూతవేటు దూరంలోని అన్నిహంగులతో పట్టణాన్ని తలతన్నేలా ఉన్న హస్తినాపురంలో పెద్దపెద్ద నిర్మాణాలు చేపట్టి 20 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. సుమారు 50 మందికి పైగా కాలనీవాసులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసినా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు మాత్రం ఓటు హక్కు కల్పించేందుకు సముఖత వ్యక్తం చేయడంలేదు. మున్సిపాలిటీ పరిధిలో ఓటుహక్కు కల్పిస్తే వెంచర్‌లో నివాసం ఉంటున్న ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుందని ఓటు హక్కుకు ససేమిరా అంటున్నారు.

ఇదే తరహాలో పట్టణంలోని ద్వారకానగర్, మారుతినగర్, ప్రశాంతినగర్‌తో పాటు మిద్దెబావి, సుందరయ్య కాలనీల్లో నివాసం ఉంటున్న వందలమందికి ఓటు హక్కు కల్పించకపోవడంతో పట్టణాల్లో బంధువులు, అద్దె ఇంటి డోర్ నంబర్లతో నివాసం ఒక చోట, ఓటు హక్కు మరొక చోట దక్కించుకునే పరిస్థితి వినుకొండలో నెలకొని ఉంది. ఇప్పటికైనా అధికారులు వినుకొండ పరిధిలో నివాసం ఉంటున్న ప్రజలకు ఓటు హక్కు కల్పించాలని హస్తినాపురం వాసులు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి...

పట్టణ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్లకు సమీపంలోని గ్రామపంచాయతీ డీటీడీ అప్రూవల్‌తో ప్లాట్లు అమ్ముతున్నారని, ఎక్కడ అప్రూవల్ తీసుకుంటే ఆ పంచాయతీ పరిధిలోకి వస్తారని, దీని వల్ల నూతన వెంచర్లలో నివాసం ఉండే ప్రజలకు పంచాయతీ పరిధిలోనే సర్టిఫికెట్లు పొందాల్సి వుంటుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసేటప్పుడు అప్రూవల్ తప్పనిసరిగా చూసుకొని కొనుగోలు చేయాలని అంటున్నారు.

ఎంపీ పేరు లేకుండానే శిలాఫలకాలు

● ప్రొటోకాల్ పాటించని అధికారులు ● ఎంపీ రాజీనామాను ఆమోదించకముందే పేర్లు తొలగింపు



ఎంపీ పేరు లేకుండా ఏర్పాటుచేసిన శిలాఫలకం

శావల్యాపురం, ఫిబ్రవరి 11: నర్సరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు రాజీనామాను ప్రభుత్వం ఆమోదించకముందే అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఏర్పాటు చేసిన శిలాఫలకాలపై అధికారులు ఎంపీ పేరును ముద్రించలేదు. మండలంలోని కారుమంచి సొసైటీ ఆధ్వర్యంలో కారుమంచి-గుంటుపాలెం గ్రామాల మధ్య నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం, గుంటుపాలెం సమీపంలో నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్, ఉపాధిహామీ నిధులతో గుంటుపాలెంలో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ప్రారంభోత్సవాలను స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదివారం నిర్వహించారు. ప్రోటోకాల్ ప్రకారం అధికారులు కార్యక్రమానికి ఎంపీని ఆహ్వానించకపోగా వాటికోసం ఏర్పాటుచేసిన నాలుగు శిలాఫలకాలపై ఎంపీ పేరును కూడా తొలగించారు. ప్రోటోకాల్ పాటించడంలో అధికారులు విఫలమయ్యారని, ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

జగన్ వ్యతిరేకతే కేంద్రంగా రాజకీయ పునరేకీకరణ

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 11: అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన ముఖ్యమంత్రి జగన్ వ్యతిరేకతే కేంద్రంగా రాష్ట్ర రాజకీయాల్లో పునరేకీకరణ జరుగుతుందని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గడిచిన కొంతకాలంగా రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నుంచి తెలుగుదేశం, జనసేనలోకి కొనసాగుతున్న భారీ వలసలే ఇందుకు నిదర్శనం అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ప్రజల నోటికాడ ముద్ద లాగేస్తున్న దుర్మార్గపు పాలనపై పెల్లుబుకుతున్న ప్రజావ్యతిరేకతతో వైసీపీ అడ్రస్ గల్లంతు కావటం ఖాయమన్నారు. మరీ ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం యాత్ర పూర్తయ్యే నాటికి వైసీపీకి టూ లెట్ బోర్డు పెట్టడం ఖాయమన్నారు. పట్టణంలో ఆదివారం ప్రత్తిపాటి గార్డెన్‌లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో భరించలేని స్థాయికి చేరిన వైసీపీ అన్యాయాలు, అణచివేతలకు వ్యతిరేకంగా 220 రోజుల పాటు 3,132 కిలోమీటర్లు సాగిన యువగళం యాత్రకు కొనసాగింపుగా నవశకం నినాదాన్ని సాకారం చేసే దిశగా శంఖారావం సరికొత్త రికార్డు సృష్టించటం ఖాయమన్నారు. మరికొన్ని రోజుల్లో వైసీపీ పార్టీ తరుపున జగన్ ప్రకటించిన అభ్యర్థులు కూడా పారిపోయే అవకాశం ఉందన్నారు. ఆ పార్టీ తరుపున నామినేషన్ వేయటానికి కూడా భయపడే పరిస్థితి రాబోతుందన్నారు. జగన్‌రెడ్డికి ఉన్న ధనదాహం, అహంకారంతో ఆ పార్టీకి అభ్యర్థులు కూడా కరువయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. లోకేశ్ శంఖారావం 40నుంచి 50 రోజుల పాటు 120 నియోజకవర్గాల మీదుగా సాగనుందని, ఈ యాత్రను విజయవంతం చేయాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.

50 కుటుంబాలు టీడీపీలో చేరిక

వైసీపీ నాయకుల అరాచకాలు తాళలేకే ప్రజలు టీడీపీలోకి వస్తున్నారని, రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పటం ఖాయమని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. నియోజక వర్గంలో వైసీపీకి చెందిన పలువురు ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. యడ్లపాడు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాకర్లపూడి అంకారావు, వారితో పాటు 50 కుటుంబాలు ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీలో చేరాయి.

ఈ మేరకు ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రత్తిపాటి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైసీపీ పాలనలో కష్టాలు రెండితలయ్యాయని, చంద్రబాబు మళ్ళీ సీఎం ఐతేనే వాటికి పరిష్కారం లభిస్తుందనే ఉద్దేశంతో టీడీపీలో చేరినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ జగన్ ఫేక్ సంక్షేమం ప్రచారాన్ని నమ్మిన వారందరికీ మిగిలినవి కష్టాలు, కన్నీళ్ళేనన్నారు.

అధికార పార్టీ ఓట్లాటతో అమాయకులు బలి: కిషోర్

కారుమంచి (శావల్యాపురం) ఫిబ్రవరి 11: గ్రామాలలో అధికారపార్టీ నాయకులు ఓట్లాటలతో అమాయక ప్రజలను బలిచేస్తున్నారని మండలంలోని కారుమంచికి చెందిన 5వ వార్డు సభ్యుడు, మాజీ ఉపసర్పంచ్ వరగాని కిషోర్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలో వార్డుమెంబర్‌గా కొనసాగుతున్న తన ఓటు తొలగించేందుకు అధికారపార్టీ నేతలు గ్రామానికి చెందిన శాఖమూరి శ్రీనివాసరావు పేరుతో ఫారం-7 దరఖాస్తులు పెట్టారని, తనకు గ్రామంలోనే ఇళ్ళు పొలాలున్నాయని, జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో చిరువ్యాపారం చేస్తూ అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చి వెళుతున్నానని తెలిపారు. ఫారం-7 పెట్టిన శ్రీనివాసరావును ఎందుకు పెట్టారని అడగగా తనకు చదువు లేదని, ఫారం-7 అంటే ఏమిటో కూడా తనకు తెలియదని అంటున్నాడని తెలిపారు. ఇదే శ్రీనివాసరావు గ్రామానికి చెందిన గోపాళం నాగేశ్వరరావు, మల్లికార్జునరావు, పద్మ, ఇందిర ఓట్లు తొలగించేందుకు ఫారం-7లు పెట్టినట్టుగా ఆన్‌లైన్‌లో నమోదైందన్నారు. ఇలానే గ్రామంలో మరికొంతమందివి ఫారం-7లు పెట్టిన బండారుపల్లి వెంకటేశ్వర్లు, కిలారు పాపారావులను కూడా అడిగితే తాము పెట్టలేదని చెప్పారన్నారు. ఇలా అమాయకులను అడ్డం పెట్టి అధికార పార్టీ నాయకులు టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు కుట్రలు పన్నుతున్నారని, ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల అధికారులు దీనిపై విచారణచేసి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏపీ అభివృద్ధిలో బీజేపీ ప్రభుత్వానిది కీలకపాత్ర

● పల్లెకు పోదాం ప్రోగ్రాం మండల కన్వీనర్ శ్రీనివాసరావు

శావల్యాపురం, ఫిబ్రవరి 11: తొమ్మిదిన్నరేళ్ల బీజేపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ఎన్నో రకాలుగా నిధులను కేటాయించి రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిందని పల్లెకు పోదాం ప్రోగ్రాం మండల కన్వీనర్ గట్టుపల్లి శ్రీనివాసరావు అన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేల్పూరు, యలమావారిపాలెం, బొందిలిపాలెం గ్రామాల్లో వినుకొండ పట్టణ బీజేపీ అధ్యక్షుడు నల్లూరి వీరరాఘవులు, బీజేపీ నేతలు ఆదివారం పర్యటించి బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. వేల్పూరులో జూనియర్ కాలేజీకి అనుమతులు మంజూరు చేయాలని, వేల్పూరు నుంచి వెలమావారిపాలెం వెళ్ళే రోడ్డుకు మరమ్మతులు చేయాలని, గంటవారిపాలెం నుంచి వేల్పూరు జడ్పీ పాఠశాలకు వీధిలైట్లు వేయించాలని, బొందిలిపాలెం ఎస్టీ కాలనీవాసులకు నివాస గృహాలను మంజూరు చేయాలని కోరగా గ్రీవెన్స్ ద్వారా, సరళ్‌యాప్ ద్వారా పీఎంవో పేషీకి తెలియజేస్తామన్నారు. మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాయనూతల ఆదాం, నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, వట్టెం శివాజీ, తలపుల ప్రసాద్, సుబ్బారావు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలి: మేడా

బొల్లాపల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని వెల్లటూరులో ఆదివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు జిల్లా ఉపాధ్యక్షుడు ఏ సుధాకర్ బాబు ఆదేశాల మేరకు పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ మేడం రమేష్ వెల్లటూరులో పర్యటించారు. ఈ సందర్భంగా వెల్లటూరులోని మిట్టమీద బజారులో రైతులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే పీఎం కిసాన్, ప్రభుత్వం అందించే పలు రకాల పథకాలను రైతులకు వివరించారు. ఉజ్వల పథకంలో పేదలకు ఉచిత గ్యాస్‌ను ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 11: స్థానిక ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఉన్న వనరులను ఉపయోగించుకొని భవిష్యత్తులో కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, సభ్యులు రామ్మోహన్, కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పందన కార్యక్రమం రేపటికి వాయిదా

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 11: కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందన హాలులో నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం మంగళవారం నాటికి వాయిదా వేసినట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. పల్నాడు జిల్లా ప్రజలందరూ మార్పులు గమనించి మంగళవారం నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

మహంకాళి ఆలయ పునఃనిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ఇసప్పాలెం (నరసరావుపేట రూరల్), ఫిబ్రవరి 11: ఇసప్పాలెం మహంకాళి అమ్మవారి దేవస్థానం పునఃనిర్మాణ పనులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఆదివారం ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా దేవాలయం బేస్మెంట్ పూర్తికావడంతో రాతితో ప్రత్యేకంగా నగిషీ చెక్కబడిన శిల్పాలను బేస్మెంట్‌పై క్రేన్‌లతో అమర్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి టి. సుధాకరరెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌కొత్త సాంబశివరావు, ధర్మకర్తల మండలి సభ్యుడు కాకుమాను వెంకటబదరీనారాయణ, బూసా సుబ్రమణ్యేశ్వరరావు, నంద్యాల మాధవీదేవి, ఆలపాటి ప్రసాదరావు, దరువూరి రజని, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 11: ఏఎన్‌యూ డిగ్రీ ఫలితాలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. బీఎస్సీ ఎంపీసీఎస్‌లో కే వెంకటలక్ష్మి 715/750, బీఎస్సీ ఎంపీసీలో షేక్ షబానామీరా 709/750, టీ హేమ బీఎస్సీ ఎపీసీఎస్‌లో 703/750, డీ వెంకట కల్పన బీఎస్సీ ఎంఎస్‌సీఎస్‌లో 692/750, బీకామ్‌లో సయ్యద్ మోమినా కౌసీ 645/700 మార్కులు సాధించారన్నారు. అన్ని గ్రూపులలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ నాతాని వెంటేశ్వర్లు, సతీష్, డాక్టర్ యోగేశ్వరరావు, వై శ్రీకాంత్, అధ్యాపకులు అభినందించారు.

వైభవంగా వాసవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల, ఫిబ్రవరి 11: మండల కేంద్రమైన రొంపిచర్లలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం పూజలను అర్చకులు నిర్వహించారు. 26వ వార్షికోత్సవం సందర్భంగా పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి జరిగిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొన్నారు. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం కూడా జరిగింది. అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరరావు, ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్యులు పర్యవేక్షించారు. సాయంత్రం భజనా కార్యక్రమాలు జరిగాయి.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

ప్రత్తిపాటి ఫౌండేషన్ కంటి వైద్య శిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 11: నిరంతరాయంగా పేద ప్రజలకు సేవ చేయటమే లక్ష్యంగా ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు వైద్య శిబిరాలు నిర్వహించినట్లు మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ఆదివారం ప్రత్తిపాటి గార్డెన్‌లో శంకర్ హాస్పటల్ వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన 34వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. లక్ష్మీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విదార్థులు, పీఎంపీ, ఆర్‌ఎంపీ వైద్యులు శిబిరంలో ప్రత్యేకంగా సేవలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 34 వైద్య శిబిరాల ద్వారా అనేక మందికి శస్త్ర చికిత్సలుచేసి కళ్ళజోళ్ళు పంపిణీ చేసినట్లు ప్రత్తిపాటి వెల్లడించారు. ఈ నెల 18వ తేదీ మరో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు, గుండె, థైరాయిడ్, కిడ్నీ, జీర్ణాశయం సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నామన్నారు. ఈ అవకాశాన్ని సమీపప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థికసాయం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 11: మండలంలో పసుమర్రు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ ఫరీశ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు సంతాపాన్ని తెలిపి వారి కుటుంబానికి ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.20వేలు ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో షేక్ రఫీ, రుస్తుం మస్తాన్‌వలి, షేక్ జానీ బాషా, రఫీ, బాషా, దొడ్డా చైతన్య, నిమ్మగడ్డ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: మండలంలోని చంఘీజ్‌ఖాన్‌పేట గ్రామానికి కఠారి పార్వతి ఇటీవల మరణించటంతో విషయం తెలుసుకున్న మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వారి కుటుంబానికి తన ప్రగాఢ సంతాపం తెలియజేసి ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆంజనేయులు, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సాయిబాబా, భాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు కామినేని సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

ఈపూరు, ఫిబ్రవరి 11: మండలంలోని బోడెపూడివారిపాలెం సమీపంలోని పొలాలలో పేకాట స్థావరంపై ఈపూరు ఎస్ఐ ఎస్‌కే మహమ్మద్ ఫిరోజ్ ఆదివారం దాడులుచేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ28వేల990లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని, కలెక్టర్ శివ శంకర్

కొండవీడు ఫెస్ట్‌కు పలువురు ప్రముఖులు

యడ్లపాడు, ఫిబ్రవరి 11: కొండవీడు ఫెస్ట్-2024లో భాగంగా రెండో రోజైన ఆదివారం కొండవీడును పలువురు ప్రముఖులు సందర్శించారు. రెండోరోజు ఫెస్ట్‌ను కలెక్టర్ శివశంకర్ లోతేటి ప్రారంభించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, ఎలక్షన్ కమిషనర్ అసిస్టెంట్ అధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత హెలీరైడ్‌ను కలెక్టర్ శివశంకర్ ప్రారంభించగా మంత్రి రజినితో పాటు తదితరులు హెలీరైడ్‌లో పాల్గొన్నారు. కొండవీటి కోట నుంచి అతిథి గృహం, దేవాలయం ఘాట్ రోడ్డు వరకు నిర్మాణ పనులను రూ.5కోట్లతో ప్రారంభించారు. అక్కడి నుంచి నేరుగా వసంత రాజీయం వేదిక దగ్గరకు చేరుకొని సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఈటీవీ, జబర్దస్త్ సమీర్ భరద్వాజ్, మురళీలు అద్భుతంగా గేయాలు ఆలపించారు. తొలి రోజున ఫెస్ట్‌కు స్పందన లేకపోవటంతో రెండో రోజున వివిధ ప్రాంతాల నుంచి జనాలను తరలించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, డీఎఫ్‌వో రామచంద్రరరావు, ఆర్డీవో సరోజిని, కల్లి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా కోట పర్యాటక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా హెలీరౌండ్‌ను సోమవారం కూడా కొనసాగిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. హెలీ రైడ్ బుకింగ్ కోసం 7483432752, 9400399999లను సంప్రదించాలని ఆయన కోరారు.

సీఆర్ క్లబ్‌లో ఘంటసాలకు ఘన నివాళి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 11: పట్టణంలోని సీఆర్ క్లబ్‌లో ఆదివారం ఘంటసాల వర్ధంతి కార్యక్రమాన్ని విశ్రాంత ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పట్టణానికి చెందిన కళాకారులు పలువురు పాల్గొని ఘంటసాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది కళాకారులకు ఘంటసాల ఆదర్శంగా నిలిచారని, సినీ పరిశ్రమ ఎదుగుదలకు తోడ్పడ్డారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఆర్ క్లబ్ ఉపాధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, వివిధ పార్టీలకు చెందిన మాదాసు భాను ప్రసాదు, ఎం రాధాకృష్ణ, నాయుడు శివకుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకటరావు, పీ భక్తవత్సలరావు, పావులూరి కృష్ణారావు, రవీంద్రబాబు, బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

16న భారత్ బంద్

చిలకలూరిపేట, ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని ఆదివారం వివిధ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన నాయకులు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర లభించేలా చట్టాలు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, అధిక ధరలు తగ్గించాలని పలు ఇతర డిమాండ్లు వారు చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ఎన్.రామసుబ్బాయమ్మ, ఎం.రాధాకృష్ణ, తాళ్ళూరి బాబూరావు, పేరుబోయిన వెంకటేశ్వర్లు, పేలూరి రామారావు, మదాసు భానుప్రసాదు పాల్గొన్నారు.

వైభవంగా విఘ్నేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవం

నాదెండ్ల, ఫిబ్రవరి 11: మండలంలోని నాదెండ్ల గ్రామ సమీపంలోని నందికుంట విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానం వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది. కాగా వైసీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు భక్తులకు స్వామివారి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు జడ్పీటీసీ కే మస్తాన్‌రావు, ఎంపీపీ తలతోటి రాణి, సొసైటీ అధ్యక్షుడు మంగు ఏడుకొండలు తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నాదెండ్ల, ఫిబ్రవరి 11: మండలంలోని సంక్రాంతిపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సిరికొండ మీరయ్య కుటుంబానికి ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. ఇటీవల వీరయ్య మృతిచెందగా ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.10వేలు ఆర్థికసాయాన్ని నాయకులు సాంబశివరావు, రాము, భాస్కర్, చిన పోతురాజు, శ్రీను తదితరులు అందించారు.